S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక | తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 204 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 4 జూన్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565



## ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం


- విదేశీయుల సహా 21 మంది మృతి
- మాల్వీయానగర్ హోటల్‌లో బీభత్సం
- 40 మందికి పైగా రక్షణ..
- పలువురి పరిస్థితి విషమం
- మృతుల కుటుంబాలకు పరిహారం : మోదీ



4

## తెలంగాణ, థురింగియా మధ్య
# ఒప్పందం

టెక్నాలజీ, స్కిల్ డెవలప్ మెంట్ రంగాల్లో
## పరస్పర సహకారం



## జర్మనీ రాష్ట్ర ప్రతినిధి బృందంతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

- సెమీ కండక్టర్స్ రంగంలో పెట్టుబడులపై కీలక చర్చలు
- ఏఐ రాకతో కొత్త అవకాశాలు!
- ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఎంఓయూ
- జర్మనీ అవసరాలకు తగ్గట్లు మన యువతకు శిక్షణ

ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో శరవేగంగా వస్తున్న సాంకేతిక మార్పులు, ముఖ్యంగా ఏ ఐ సృష్టిస్తున్న సరికొత్త అవకాశాలను పూర్తిగా అందిపుచ్చుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. జర్మనీ లాంటి అభివృద్ధి చెందిన దేశాల అవసరాలకు తగ్గట్లు తెలంగాణ యువతను అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలతో తీర్చిదిద్దే లక్ష్యంగా.. థురింగియా రాష్ట్రంతో చారిత్రక ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, థురింగియా సీ ఎం మారియో వోయిట్ నేతృత్వంలో జరిగిన ఈ కీలక భేటీ.. రెండు రాష్ట్రాల మధ్య నైపుణ్యాభివృద్ధికి, పరస్పర సహకారానికి గట్టి పునాది వేసింది. యువతకు ఆధునిక శిక్షణ, టెక్నాలజీ బదిలీ, స్టార్టప్ ల ప్రోత్సాహంతో పాటు సెమీ కండక్టర్స్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో భారీ పెట్టుబడులతో జర్మన్ కంపెనీల రాకకు ఈ ఒప్పందం మార్గం సుగమం చేసింది. విదేశీ ప్రతినిధులు సైతం తెలంగాణ ప్రభుత్వ విజన్ ను ప్రశంసించడంతో.. రాష్ట్ర ప్రతిష్ట గ్లోబల్ స్థాయిలో మరింత పెరిగిందనే చర్చ జరుగుతోంది.

వివరాలు 2లో..

## కేజీ బేసిన్ పనులు వేగవంతం చేయాలి



5

- సీఎం చంద్రబాబుతో ఓఎన్‌జీసీ చైర్మన్ అరుణ్ కుమార్ సింగ్ భేటీ
- ఇంధన రంగ విస్తరణ, ఉపాధి అవకాశాలపై కీలక చర్చ

సచివాలయంలో చంద్రబాబుతో ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) చైర్మన్ అరుణ్ కుమార్ సింగ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా-గోదావరి (కేజీ) డెల్టా బేసిన్‌లో జరుగుతున్న సహజవాయువు, చమురు అన్వేషణ, వెలికితీత పనుల పురోగతితో పాటు సంస్థ భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై ఇరువురి మధ్య కీలక చర్చ జరిగింది.

## విశాఖ-కాకినాడ తీరంలో భారీ కెమికల్ ప్లాంట్

- రష్యా దిగ్గజానికి లోకేష్ ఆహ్వానం
- ప్రముఖ రసాయన సంస్థ రస్ కెమ్ గ్రూప్‌తో కీలక భేటీ
- పోర్టు ఆధారిత లాజిస్టిక్స్ హబ్ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి
- లోకేష్ ప్రతిపాదనలపై ఉన్నతస్థాయిలో చర్చిస్తామన్న రస్ కెమ్ ప్రతినిధులు
- రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా రష్యా పర్యటనలో మంత్రి నారా లోకేష్ కృషి

5





## ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

- జిల్లాకో ప్రత్యేక థీమ్... టూరిజం ప్రాంతాల వేదికగా యోగా డే
- జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్రంలో యోగాంధ్ర కార్యక్రమాలు
- పవన్ కళ్యాణ్ పై తెలంగాణ నేతల వ్యాఖ్యలు సరి కావు
- ఏ ప్రాంతానికి ఎవరేం చేశారో ప్రజలకు తెలుసు
- మంచి పనులపై బురద జల్లడమే కొందరి పని
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

5



భూమి పుత్రుల
# జాగీరే

## ఇంటికొస్తే బిర్యానీ పెడతాం!

సచివాలయంలో వేలు పెడితే ఊరుకోం

ఆవిర్భావం నాడు పవన్ సభ పెడితే ఎలా?

11 రోజులు అన్నం తినలేదన్నది వాస్తవం కాదా..

పవన్ కల్యాణ్‌కు కేటీఆర్ ఘాటు కౌంటర్

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అన్నలా ఇంటికి వస్తే బిర్యానీ పెడతాం తప్ప, తెలంగాణ సచివాలయంలో వేలు పెడతామంటే ఊరుకోబోమని ఘాటుగా హెచ్చరించారు. ప్రాంతీయవాదం పేరుతో తెలంగాణపై పవన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. ఇదే సమయంలో తెలంగాణ పాలిట నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్ పార్టీనే అంటూ అధికార పార్టీపైనా విరుచుకుపడ్డారు.

## వచ్చే ఏడాది పాదయాత్ర!

- కడుపులో కత్తులు పెట్టుకోలేను!
- నవ్వుతూ అబద్ధాలు చెప్పడం రాదు
- కరోనా కంటే కాంగ్రెస్ పార్టీనే డేంజర్
- సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కేటీఆర్

వివరాలు 2లో..

## 150, 200 ఎంఎల్ బాటిళ్లు

కొత్త పరిమాణాల్లో మద్యం సీసాల అమ్మకాలు

ఎక్సైజ్ శాఖ మద్యం విక్రయాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మద్యం సీసాల పరిమాణాలకు అదనంగా కొత్త సైజులను ప్రవేశపెట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ పాత నిబంధనలను సవరిస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది.

2



4



## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు రాజ్యాంగ రక్షణ లేదు

సుప్రీంకోర్టు ధర్మాసనం

## గిరిజనాభివృద్ధికి రాష్ట్రపతి పిలుపు

గిరిజన సంక్షేమంపై దృష్టి

జాతీయ సదస్సుకు ప్రారంభం

4





ఆదాయానికి మించి ఆస్తుల కేసులో
## భుజంగరావు అరెస్ట్

- ఏకకాలంలో 15 ప్రాంతాల్లో దాడులు
- బయటపడిన 5.92 కోట్ల ఆస్తులు
- కటకటాల పాలైన ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు

2

ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టై జ్యుడీషియల్ రిమాండ్‌కు వెళ్లి ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న మాజీ అదనపు ఎస్పీ భుజంగరావు ఇంట్లో ఏసీబీ సోదాలు కలకలం రేపాయి.



# వైద్య పర్యాటక కేంద్రంగా హైదరాబాద్!

**దక్షిణాఫ్రికా ఉపరాష్ట్రపతి పాల్ మషాతిలేతో ముఖ్యమంత్రి రేవంత్ భేటీ**

**'తెలంగాణ రైజింగ్ ప్రపంచ సదస్సు'కు రావాలని ఆహ్వానం**

**ఇరు దేశాల మధ్య పెట్టుబడుల విస్తరణపై కీలక చర్చలు**

**హైదరాబాద్, జూన్ 3:** భారత్‌లో పర్యటిస్తున్న దక్షిణాఫ్రికా ఉపరాష్ట్రపతి పాల్ మషాతిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. విద్యా, నైపుణ్యాభివృద్ధి, వైద్య పర్యాటకం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై ఇరు పక్షాలు చర్చించాయి. తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని దక్షిణాఫ్రికా బృందాన్ని కోరారు. హైదరాబాద్ ను అంతర్జాతీయ స్థాయి వైద్య పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికా కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ ప్రపంచ సదస్సు'లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపరాష్ట్రపతి పాల్ మషాతిలేతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి ఆహ్వానంపై మషాతిలే స్పందిస్తూ.. పెద్ద సంఖ్యలో తమ ప్రతినిధులు పాల్గొంటారని, ఈ సదస్సు ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు.

# ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్!

**ఇకపై ఏటా రెండుసార్లు.. సర్కారు తాజా ఉత్తర్వులు**

**మిశ్రమంగా స్పందించిన ఉపాధ్యాయ సంఘాలు**

**హైదరాబాద్, జూన్ 3 :** తెలంగాణలో సర్వీస్‌లో ఉన్న టీచర్లకు గుడ్ న్యూస్! ఇకపై ఇన్ సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏటా రెండు సాధారణ టెట్‌లకు అదనంగా మరో రెండు ప్రత్యేక టెట్ లు నిర్వహించనున్నట్లు పేర్కొంటూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక టెట్ ల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. గతేడాది సాధారణ టెట్ లో భాగంగానే ఇన్ సర్వీస్ టీచర్లకూ ఈ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులకు ఏడాదికి రెండుసార్లు ప్రత్యేక టెట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంపై టీ ఎస్ యూ టీ ఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. అయితే ప్రత్యేక టెట్ నిర్వహించాలని తమతో పాటు పలు సంఘాలు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో మాత్రం కొన్ని సంఘాల పేర్లు మాత్రమే పేర్కొనడం భావ్యం కాదని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు చావ రవి, వెంకట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# 150, 200 ఎంఎల్ బాటిళ్లు

**కొత్త పరిమాణాల్లో మద్యం సీసాల అమ్మకాలు**

**పాత నిబంధనలను సవరించిన ఎక్సైజ్ శాఖ**

**ధరల్లో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టత**

**హైదరాబాద్, జూన్ 3:** తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం విక్రయాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మద్యం సీసాల పరిమాణాలకు అదనంగా కొత్త సైజులను ప్రవేశపెట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ పాత నిబంధనలను సవరిస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్లో 90 ఎంఎల్, 180 ఎంఎల్, 375 ఎంఎల్, 750 ఎంఎల్ పరిమాణాల్లో మాత్రమే మద్యం బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీటితో పాటు కొత్తగా 150 ఎంఎల్, 200 ఎంఎల్ పరిమాణాల్లో మద్యం సీసాలను కూడా మార్కెట్లోకి తీసుకురానున్నట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అయితే కొత్త సీసాల పరిమాణాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ మద్యం ధరల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మద్యం మార్కెట్లో కొత్త మార్పులకు దారితీయనుంది.



# తెలంగాణ, థురింగియా మధ్య ఒప్పందం!

- టెక్నాలజీ, స్కిల్ డెవలప్ మెంట్ రంగాల్లో పరస్పర సహకారం
- జర్మనీ రాష్ట్ర ప్రతినిధి బృందంతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- సెమీ కండక్టర్స్ రంగంలో పెట్టుబడులపై కీలక చర్చలు
- ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు రెండు రాష్ట్రాల ఎంఓయూ
- జర్మనీ అవసరాలకు తగ్గట్లు మన యువతకు శిక్షణ



**హైదరాబాద్, జూన్ 3:** తెలంగాణ, జర్మనీలోని థురింగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ థురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు థురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్ వ్యాఖ్యలకు స్పందించిన థురింగియా సీఎం మారియోవోయిట్.. తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ (టామ్ కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, థురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుంది. సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. థురింగియా సీఎం మాట్లాడుతూ.. సెమీ కండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి శ్రీధర్ బాబు స్వాగతిస్తూ.. ఇప్పటికే హైదరాబాద్ లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో థురింగియా సీ ఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీ ఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ – 2047' విజన్ పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత, జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని, ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# జూన్ 5 నుంచి కొత్త ధరలు!

- రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల సవరణ
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ పరిధిలో పెరిగిన రేట్లు
- పారదర్శకత కోసమే ఈ సవరణలన్న మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, జూన్ 3:** తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ఫ్లాట్ల మార్కెట్ విలువల సవరణకు అధికారికంగా ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల ఐదవ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని నూట నలభై నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై విస్తృత సమీక్ష జరిపారు. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో శాస్త్రీయంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, అభివృద్ధి కారిడార్ల ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం లెక్కలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఆయా చోట్ల మార్కెట్ విలువలను సవరించింది. ఫ్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఫ్లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉండేలా నిర్ణయించారు. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట ఎలాంటి పెంపు ప్రతిపాదనలు లేవు. అలాగే హెచ్ ఎం డీ ఏ, కుడా, ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను ఖరారు చేశారు. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను నిర్ణయించడంతో పాటు, నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించారు. రెండు వేల ఇరవై ఒకటి తర్వాత నిర్మాణ వ్యయాలు మారడంతో ఆర్ సీ సీ, నాన్ ఆర్ సీ సీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేశారు. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ధారించడమే ఈ సవరణల ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణను శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకతతోనే ఈ సవరణలు అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

# బయో టెక్నాలజీలో గ్లోబల్ లీడర్!

- అత్యాధునిక వైద్య పరిశోధనల కేంద్రంగా హైదరాబాద్
- రూ.1200 కోట్లతో థెరానిమ్ బయోలాజిక్స్ ప్లాంట్ ప్రారంభం
- కొత్తగా 1500 మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి
- థెరానిమ్ బయోలాజిక్స్ ఫెసిలిటీని ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని హామీ

**సంగారెడ్డి (జనం పవర్):** క్యాన్సర్, ఇతర అరుదైన రోగాలను నయం చేసే బయోలాజిక్స్, వ్యాక్సిన్లు, సెల్ అండ్ జీన్ థెరపీ వంటి అత్యంత అధునాతన వైద్య పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పరిశోధన దశ నుంచి కమర్షియల్ ప్రొడక్షన్ దాకా అవసరమైన అన్ని సదుపాయాలను ఒకే చోట కల్పించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్రపంచ స్థాయి ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేసేలా సమగ్ర కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నామన్నారు. సంగారెడ్డి జిల్లా హత్నూరా మండలం బోర్పట్ల గ్రామంలో రూ.1200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన థెరానిమ్ బయోలాజిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఫార్మా రాజధాని హైదరాబాద్ ను బయో టెక్నాలజీ రంగంలోనూ గ్లోబల్ లీడర్ గా మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాబోయే రోజుల్లో బయోటెక్నాలజీ రంగంలో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్ డ్ జెనెటిక్స్ వంటి సాంకేతికతలు విప్లవాత్మక మార్పులు తీసుకొస్తాయన్నారు.

**మేడ్ ఇన్ తెలంగాణ బ్రాండ్..**

సాంకేతిక మార్పుల ఫలితంగా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేలా, తలెత్తే సవాళ్లను అధిగమించేలా, దిగ్గజ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేలా వ్యూహాత్మక అడుగులు వేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. లైఫ్ సైన్సెస్ పాలసీ, వన్ బయో హబ్, గ్రీన్ ఫార్మా సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్ తదితర విప్లవాత్మక అడుగులు లైఫ్ సైన్సెస్ రంగంలో మేడ్ ఇన్ తెలంగాణ బ్రాండ్ ను మరింత విశ్వవ్యాప్తం చేసేందుకు దోహదపడతాయన్నారు. ఓ వైపు లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పిస్తూనే, మరోవైపు వారికి కావాల్సిన రెడీ టూ వర్క్ ఫోర్స్ ను తయారు చేసే బృహత్తర బాధ్యతను తాము తీసుకున్నామన్నారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని దిగ్గజ ఫార్మా కంపెనీలకు మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్ గా మార్చే ప్రయాణంలో థెరానిమ్ బయోలాజిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ మరొక కీలక మైలురాయి అని, పరిశ్రమల




స్థాపనకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధుల కిత్సకు సంబంధించిన ఔషధాలను ఇక్కడ ఉత్పత్తి చేసి యూఎస్ తో పాటు పలు దేశాలకు ఎగుమతి చేయనున్నట్టు వివరించారు. ఈ ప్లాంట్ ద్వారా కొత్తగా సుమారు 1500 మందికి పైగా ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహా, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కంపెనీ ప్రతినిధులు కె. నిత్యానంద రెడ్డి, డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి, డాక్టర్ శాతకర్ణి ఎమ్., డాక్టర్ ఐ.ఎస్.ఆర్. రావు, సనత్ ఛట్టోపాధ్యాయ, దేవ్ మరాల్డో తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ.. భూమి పుత్రుల జాగీరే

- ఇంటికొస్తే బిర్యానీ పెడతాం!
- సచివాలయంలో వేలు పెడితే ఊరుకోం
- ఆవిర్భావం నాడు పవన్ సభ పెడితే ఎలా?
- 11రోజులు అన్నం తినలేదన్నది వాస్తవం కాదా
- పవన్ కళ్యాణ్‌కు కేటీఆర్ ఘాటు కౌంటర్



**హైదరాబాద్, జూన్ 3:** తెలంగాణ కచ్చితంగా ఇక్కడ భూమి పుత్రుల జాగీరే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని, సోదరుడిగా ఇంటికి వస్తే హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ, తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో జనసేన కొత్తగా చేసేదేముందని అన్నారు. దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2023 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసిందని గుర్తుచేశారు. 2018లో చంద్రబాబు కూడా పోటీ చేశారని తెలిపారు. పవన్ తెలంగాణలో పోటీ చేయండి, ఎవరు వద్దంటున్నారు. ఇక్కడికి వచ్చి అన్యాయంగా మాట్లాడటం సరికాదు అని ఆయన సూచించారు. నిజాం సర్కార్ కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల ఇది అని ఆయన గుర్తు చేశారు. ఆవిర్భావ దినోత్సవం రోజు విభజన తీరు సరిగా లేదని పవన్ అంటున్నారని, తెలంగాణపై ఉల్టాపుల్టా మాటలెందుకని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పారని, తెలంగాణ ఆవిర్భావం రోజు పవన్ సభ పెడతానంటే ఎలా అని అన్నారు. పవన్ మీటింగ్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన తెలిపారు. తెలంగాణకు దిక్సూచి కేసీఆర్ అని, వేరే ఎవరూ అవసరం లేదన్నారు. పవన్ కళ్యాణ్ మీరు ఇక్కడికి రండి, మీ కుటుంబాలు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రాంతాలుగా విడిపోయినా ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నామన్నారు. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమని పవన్ అన్నారని, మద్రాసు నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారని, అది కూడా ప్రాంతీయవాదమే అంటారా అని ప్రశ్నించారు. మోదీ తన ప్రాంతీయవాదంతో తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తరలించుకుపోతున్నారని ఆరోపించారు. జాతీయవాదం ముసుగులో ఆర్థిక ప్రాంతీయవాదం చేయడం సరైనదేనా అని, దీనికి పవన్ కళ్యాణ్ సమాధానం చెప్తారా అని కేటీఆర్ ప్రశ్నించారు. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని మాజీ మంత్రి అన్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి పవన్ మాట్లాడాలని కేటీఆర్ హితవుపలికారు. ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయొచ్చని తెలిపారు. ఎక్కడైతే పోటీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని సూచించారు. పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ సాకారమైందని అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణను కలిపింది కాంగ్రెస్ అని విమర్శించారు. 1969 ఉద్యమంలో 379 మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాలను కర్కశంగా అణచివేసింది కాంగ్రెస్ అని విరుచుకుపడ్డారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది కూడా కాంగ్రెస్సే అని అన్నారు. తెలంగాణ కథలో నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే అని, తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పోరాటం, దీక్ష లేకపోతే తెలంగాణ వచ్చేది కాదన్నారు. కేసీఆర్ హయాంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలోనూ జరగలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా అని సవాల్ విసిరారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేసిందేంటి అని ప్రశ్నించారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డ్ సృష్టిస్తోందని అన్నారు. రెండున్నరేళ్లలో రేవంత్ ప్రభుత్వం రూ. 4 లక్షల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. అప్పులపై ఒక్కో మంత్రి ఒక్కో లెక్క చెబుతున్నారన్నారు. కరోనా కంటే కాంగ్రెస్ ప్రమాదమని ప్రజలకు అర్థమైందని కే టీ ఆర్ పేర్కొన్నారు.

# వచ్చే ఏడాది పాదయాత్ర!

- కడుపులో కత్తులు పెట్టుకోలేను!
- నవ్వుతూ అబద్ధాలు చెప్పడం రాదు
- కరోనా కంటే కాంగ్రెస్ పార్టీనే డేంజర్
- సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 3:** వచ్చే ఏడాది కచ్చితంగా పాదయాత్ర చేస్తానని, కడుపులో కత్తులు పెట్టుకుని నవ్వుతూ మాట్లాడలేనని బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ ఆర్ తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. పాదయాత్ర మొదలయ్యేలోపు ఫిట్ అవ్వాలని చమత్కరించారు. వచ్చే ఏడాది పాదయాత్ర ఎప్పుడు అనేది పార్టీ నిర్ణయిస్తుందని, 2027లో కచ్చితంగా పాదయాత్ర ఉంటుందని పునరుద్ఘాటించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి, ఏ టైమ్ లో పాదయాత్ర చేయాలనే దానిపై పార్టీలో పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కడుపులో కత్తులు పెట్టుకుని, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని కే టీ ఆర్ అన్నారు. అందుకే తనకు అహంకారమని అంటారేమో అని తెలిపారు. మీకు అహంకారమని అంతా అనుకుంటారని ఇంటర్వ్యూల్లో చెప్పారు కదా, దాని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తారా అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. తనకు అహంకారమని ఎందుకు అనుకుంటారని కచ్చితంగా ఆలోచిస్తుంటానని తెలిపారు. అయితే కొంతమందికి కొన్ని మ్యానుఫ్యాక్చరింగ్ డిఫెక్ట్స్ ఉంటాయని అన్నారు. అలాగే తనకు బాడీ లాంగ్వేజ్ సమస్య ఉందని తెలిపారు. అందుకే నవ్వుతూ మాట్లాడమని మిత్రులు చెబుతుంటారని, కానీ అలా లేని నవ్వు తెచ్చుకుని తాను మాట్లాడలేనని చెప్పారు. తెలంగాణ వాడిని కదా, కడుపులో కత్తులు, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చింది బీ ఆర్ ఎస్ ప్రభుత్వం అని కే టీ ఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధిలో నంబర్ వన్ గా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని స్పష్టం చేశారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆదాయం పతనమవుతోందని తెలిపారు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ పార్టీ అని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూనే ప్రభుత్వ ప్రకటనల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని కే టీ ఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన



అప్పు రూ. 2.8 లక్షల కోట్లు మాత్రమేనని తెలిపారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ రూ. 4 లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని విమర్శించారు. అప్పు చేసి తీసుకొచ్చిన ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. బీ ఆర్ ఎస్ చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతున్నది కాకిలెక్కలు అని కే టీ ఆర్ అన్నారు. ఏడాది కాలంలో రూ. 29 వేల కోట్ల అప్పు మాత్రమే తీర్చారని, నెలకు రూ. 6 వేల కోట్ల అప్పు తీరుస్తున్నామనేది అబద్ధమని, కేవలం రూ. 2 వేల కోట్లే చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వల్ల తెలంగాణకు ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు. రాష్ట్ర అప్పులపై సీ ఎం రేవంత్ రెడ్డితో చర్చలకు సిద్ధమని ఆయన స్పష్టం చేశారు.

# పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం

- వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక
- ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు



**హైదరాబాద్, జూన్ 3:** తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.




# ఆదాయానికి మించి ఆస్తుల కేసులో భుజంగరావు అరెస్ట్

## ఏకకాలంలో 15 ప్రాంతాల్లో దాడులు

**హైదరాబాద్, జూన్ 3:** ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టై జ్యుడీషియల్ రిమాండ్‌కు వెళ్లి ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న మాజీ అదనపు ఎస్పీ భుజంగరావు ఇంట్లో ఏసీబీ సోదాలు కలకలం రేపాయి. పోలీసు శాఖలో పనిచేసిన సమయంలో ఆయన భారీగా ఆస్తులు కూడబెట్టారనే అభియోగాల నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన నివాసంతో పాటు బంధువుల ఇళ్లలోనూ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్, సూర్యాపేట తదితర పదిహేను ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల అనంతరం భుజంగరావును ఏసీబీ అధికారులు అధికారికంగా అరెస్టు చేశారు. ఈ దాడుల్లో ఏసీబీ అధికారులు మొత్తం రూ. 5.92 కోట్ల విలువైన అక్రమాస్తు లను గుర్తించారు. సూర్యాపేటలో 27 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్నట్లు తేల్చారు. వీటితో పాటు ఐదు ఇంటి స్థలాలు, రెండు ఇళ్లు, హైదరాబాద్ లో ఒక కమర్షియల్ భవనాన్ని గుర్తించారు. సోదాల్లో కిలో బంగారు నగలు లభించాయి. ఆయన బ్యాంకు ఖాతాల్లో రూ. 3.83 లక్షల నగదు ఉన్నట్లు అధికారులు నిర్ధారిం చారు. సోదాల సమయంలో అధికారులకు భారీగా మద్యం సీసాలు కూడా లభించాయి. మొత్తం 29 మద్యం సీసాలను ఏసీబీ అధికారులు గుర్తించారు. దీనిపై తదుపరి విచారణ నిమిత్తం వారు వెంటనే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించారు. బుధవారం సాయంత్రం వరకు ఈ సోదాలు కొనసాగాయి.

# డిస్కంలను ముక్కలు చేసే కుట్ర!

- కాంగ్రెస్ కొత్త విధానం వెనుక వేల కోట్ల స్కాం
- బీఆర్ఎస్ సమావేశంలో ఎమ్మెల్యే వేముల సంచలన ఆరోపణలు
- ప్రభుత్వ ఆస్తులు కాంగ్రెస్ సొంతానికి వాడుకుంటున్నారని మండిపాటు

**నిజామాబాద్, జూన్ 3:** విద్యుత్ డిస్కంలను మూడు ముక్కలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తున్న కొత్త విధానం వెనుక వేల కోట్ల కుంభకోణం దాగి ఉందని బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. నిజామాబాద్ నగరంలోని ఓ ఫంక్షన్ హాల్ లో జరిగిన బీ ఆర్ ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, సర్ అవగాహన, బీ ఆర్ ఎస్ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ.. ఫ్యాక్టరీలు, కమర్షియల్, గృహ అవసరాలకు సంబంధించి ఆదాయం వచ్చే డిస్కంలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి వేల కోట్లు దోచుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పథకం వేసిందని ఆరోపించారు. ఆదాయం లేని, బిల్లులు రాని రైతు వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ, లిఫ్ట్ ఇరిగేషన్ కనెక్షన్లను కలిపి 'రైతు డిస్కాం'గా మారుస్తున్నారని తెలిపారు. గతంలో కమర్షియల్, ఇండస్ట్రియల్ విభాగాల నుండి వచ్చే ఆదాయంలో నుంచి ఏటా రూ. 10 వేల కోట్లు ఉచిత వ్యవసాయ విద్యుత్ కోసం వాడేవారమని, ఇప్పుడు లాభాలు వచ్చేవి ప్రైవేటుకు ఇచ్చి కరెంట్ డిపార్ట్మెంట్ పై ఉన్న రూ. 35,000 కోట్ల బాకీని రైతు డిస్కాంపై నెడుతున్నారని వేముల మండిపడ్డారు. దీనివల్ల భవిష్యత్తులో రైతులకు ఉచిత కరెంట్ అందకుండా చేసి, వ్యవసాయ రంగాన్ని నిలువునా ముంచేందుకు రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఈ వేల కోట్ల కుంభకోణాన్ని ప్రజలందరికీ వివరించి కాంగ్రెస్ గుట్టు రట్టు చేయాలని బీ ఆర్ ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

## ఆస్తులన్నీ సొంతానికే..

నిజామాబాద్ నగరంలో గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అద్భుతమైన అభివృద్ధిని కాంగ్రెస్, బీ జే పీ పార్టీలు నాశనం చేస్తున్నాయని వేముల ధ్వజమెత్తారు. ప్రజల కోసం ఉద్దేశించిన ప్రభుత్వ ఆస్తులను కాంగ్రెస్ పార్టీ తన సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆరోపించారు. గతంలో బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్ టీ సీ చైర్మన్ గా ఉన్న సమయంలో నిజామాబాద్ జిల్లా ప్రజల అవసరాల కోసం మెయిన్ రోడ్డుపై, రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఇరిగేషన్ ఎస్ ఈ ఆఫీస్ స్థలాన్ని కొత్త బస్టాండ్ నిర్మాణం కోసం ఎంపిక చేశామని గుర్తుచేశారు. ఆనాడు ఆర్ టీ సీ బోర్డు మీటింగ్ లో రూ. 20 కోట్ల నిధులతో అత్యాధునిక బస్టాండ్ నిర్మించాలని ప్రతిపాదనలు కూడా ఆమోదించారని తెలిపారు. కానీ నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, కోట్ల రూపాయల విలువైన ఆ బస్టాండ్ స్థలాన్ని ప్రజల అవసరాలకు కాకుండా, వారి సొంత కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ కోసం, కమర్షియల్ కాంప్లెక్స్ (షాపింగ్ మాల్స్) నిర్మించి కిరాయిల ద్వారా డబ్బులు సంపాదించుకోవడానికి కేటాయించుకోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడే పవన్ కళ్యాణ్ ఇక్కడ సభలు పెడతా అనడంపై వేముల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ వస్తే బాధపడి పదకొండు రోజులు అన్నం తినని పవన్ కళ్యాణ్ ఇవాళ మన గడ్డపైకొచ్చి పునర్నిర్మాణం గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి వీ జీ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్ రెడ్డి, హన్మంత్ షిండే, జాజాల సురేందర్, నియోజకవర్గ ఇన్చార్జి రవీందర్ సింగ్, మాజీ మేయర్ నీతు కిరణ్, నూడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సిర్ప రాజు, సత్య ప్రకాష్, సుజిత్ సింగ్ ఠాకూర్, నవీద్ ఇక్బాల్ తో పాటు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఢిల్లీలో ఘోర అగ్ని విషాదం

- విదేశీయుల సహా 21 మంది మృతి
- మాల్వీయానగర్ హోటల్‌లో బీభత్సం
- 40 మందికి పైగా రక్షణ.. పలువురి పరిస్థితి విషమం
- హోటల్ భద్రతా ప్రమాణాలపై దర్యాప్తు
- మృతుల కుటుంబాలకు పరిహారం : మోదీ






**న్యూఢిల్లీ, జూన్ 3:** దేశ రాజధాని ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుని 21 మంది మృతి చెందారు. మా ఓల్వీయా నగర్‌లోని హౌజ్ రాణి ప్రాంతంలో ఉన్న ఫ్లోరిష్ స్టే బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌లో మంటలు చెలరేగడంతో ఈ విషాదం సంభవించింది. ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడగా, వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఉదయం 8.50 గంటల సమయంలో అగ్నిప్రమాదం జరిగినట్లు ఢిల్లీ అగ్నిమాపక శాఖకు సమాచారం అందింది. వెంటనే అగ్నిమాపక దళాలు, పోలీసులు, విపత్తు స్పందన బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అయితే అప్పటికే భవనమంతా దట్టమైన పొగతో నిండిపోవడంతో లోపల ఉన్నవారిని బయటకు తీసుకురావడం సవాలుగా మారింది. సహాయక బృందాలు 40 మందికి పైగా బాధితులను రక్షించి వివిధ ఆసుపత్రులకు తరలించాయి. మాక్స్ ఆసుపత్రికి తరలించిన 39 మందిలో 18 మంది మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో 15 మందికి



ఐసీయూలో చికిత్స అందిస్తుండగా, వారిలో ఎనిమిది మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. స్వల్ప గాయాలైన కొందరిని చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు. ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు 13 మందిని తరలించగా, వారిలో భవనం నుంచి దూకిన బాధితులతో పాటు సహాయక చర్యల్లో పాల్గొన్న ఢిల్లీ పోలీసు సిబ్బంది కూడా ఉన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించినట్లు అధికారులు వెల్లడించారు. అగ్నిప్రమాదం కారణంగా భవనం తీవ్రంగా దెబ్బతింది. కాలిపోయిన వస్తువులు, శిథిలాలు, పగిలిన అద్దాల ముక్కలు పరిసర ప్రాంతాల్లో చెల్లాచెదురుగా కనిపించాయి. సహాయక చర్యలకు ఆటంకం కలగకుండా అధికారులు ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారి ఏకే మాలిక్ తెలిపిన వివరాల ప్రకారం, ప్రమాదం జరిగిన భవనంలో బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు ఐదు అంతస్తులు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో రెస్టారెంట్ ఉండగా, మిగిలిన భాగాన్ని హోటల్‌గా వినియోగిస్తున్నారు. వైద్య చికిత్సల కోసం భారతదేశానికి వచ్చే విదేశీయులు ఎక్కువగా ఈ హోటల్‌లో బస చేస్తుండటంతో మృతుల్లో విదేశీయుల సంఖ్య అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతులు ప్రధానంగా మధ్య ఆసియా, ఆఫ్రికా దేశాలకు చెందినవారని వెల్లడించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, మంటలు వ్యాపించడంతో కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు అద్దాలు పగులగొట్టి భవనం పై అంతస్తుల నుంచి కిందకు దూకారు. ఒక వ్యక్తి కిందపడటంతో కాలు విరిగినట్లు కనిపించిందని వారు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోపు స్థానికులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. కిందకు దూకిన వారికి గాయాలు తక్కువగా తగలేందుకు కొందరు నేలపై పరుపులు పరిచారు. మరికొందరు బాధితులకు అత్యవసర ప్రథమ చికిత్స అందించేందుకు ప్రయత్నించారు. ప్రస్తుతం సహాయక చర్యలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. హోటల్‌కు ఒకే ఒక్క ప్రవేశ, నిష్క్రమణ మార్గం ఉండటంతో పాటు అగ్నిమాపక శాఖ నుంచి అవసరమైన అనుమతులు, ఎన్‌ఓసీ ఉన్నాయా లేదా అనే అంశాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. అగ్నిప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు.



# బెంగాల్‌లో మమతకు బ్యాడ్ టైమ్!

## దూరమవుతున్న నేతలు.. టీఎంసీలో సంక్షోభం

కాంగ్రెస్‌లో ఉండగా ఫైర్‌బ్రాండ్ పేరు తెచ్చుకుని ప్రజలకు చేరువయ్యేలా ఎత్తులు, జిత్తుల వేసిన మమతా బెనర్జీ ఇప్పుడు దాదాపుగా ఒంటరిగా మారక తప్పడం లేదు. దాదాపు పదిహేనేళ్ల పశ్చిమబెంగాల్‌ను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన దీదీ నిరంకుశ పాలనకు తెరతీశారు. బెంగాల్లో అధికారమే లక్ష్యంగా ఆమె చేసిన పనులు దేశ ఐక్యతను దెబ్బతీసే స్థితికి చేరాయి. లక్షల్లో బంగ్లా దేశీయుల చొరబాట్లను ప్రోత్సహించి, ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చినా.. పాపం పండింది. ఇప్పుడు ఎక్కడ చూసినా బంగ్లా జీతాయులు బెంగాల్‌ను వీడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సువేందు అధికారి పగ్గాలు చేపట్టగానే తొలుత బంగ్లాదేశాయులను తరిమివేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఇప్పుడు సరిహద్దుల్లో వారు వేలాదిగా గుమికూడి భారత్‌ను వీడే దృశ్యాలు కనిపిస్తున్నాయి. అధికారంలో ఉండగా నిరంకుశంగా వ్యవహరించారు. ఓ స్త్రీ అధికారంలో ఉంటే ఎంతగానో అభివృద్ధి చెందాలసిన బెంగాల్ అరాచక పాలనకు కేంద్రబిందువుగా మారింది. అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు రాజ్యమేలాయి. ఇవన్నీ ఇప్పుడు శాపంగా మారి మమతను వెంటాడుతున్నాయి. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తృణమూల్ కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. ఫలితాలు వెలువడి నెల రోజులైనా కాకముందే.. అంతర్గత విభేదాలతో పార్టీ సతమతమవుతోంది. అధినాయకురాలు మమతా బెనర్జీకి పార్టీపై ఉన్న పట్టు సడలుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 50 మంది తృణమూల్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం.. మంగళవారం స్వయంగా దీదీ నిర్వహించిన ధర్నాకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరు కావడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం అవతరించినప్పటి నుంచీ.. తృణమూల్‌లో తలెత్తిన అతిపెద్ద సంక్షోభంగా దీనిని చెప్పవచ్చు. బెంగాల్‌లో ఇటీవలి ఎన్నికల్లో తృణమూల్ తరఫున 80 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి పార్టీకి 40 మందికి పైగా ఎంపీలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా మమత కోల్‌కతాలో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం చేపట్టిన నిరసనకు ఆరుగురు ఎమ్యెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. వీరిలో డెరెక్ ఓబ్రియెన్, కల్యాణ్ బెనర్జీ, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ, నైనా బందోపాధ్యాయ వంటి సీనియర్ నేతలే ఉన్నారు. కొత్తగా పార్టీ తరఫున ఎన్నికైనవారెవరూ నిరసనకు హాజరవలేదు. మమత అధ్యక్షతన ఇటీవల తృణమూల్ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. 20 మందే వచ్చారు. దీంతో ఆ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చింది. తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకరుకు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను తృణమూల్ సస్పెండ్ చేసింది. పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నారు. చీలిక వర్గానికి మెజార్టీ ఉందని అతను ప్రకటించడం మమతా బెనర్జీకి మింగుడుపడని వ్యహారంగా చూడాలి. తృణమూల్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం తమ శాసనసభా పక్ష నేతగా రితబ్రతను నియమించాలని కోరుకుం టున్నట్లు సమాచారం. పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మంది ఎమ్యెల్యేలు యత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ఆ బలం కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగానే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు సోమవారం రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. స్వయంగా మమత, ఆమె సన్నిహితుడు కునాల్ ఘోష్ కూడా తృణమూల్‌లో విభేదాలు ఉన్నాయని అంగీకరించారు. పార్టీ నాయకత్వానికి తెలియకుండా రహస్య సమావేశాన్ని ఏర్పాటుచేసి పార్టీలో చీలిక తెచ్చేందుకు రితబ్రత ప్రయత్నిస్తున్నట్లు కునాల్ ఆరోపించారు. వీటిని రితబ్రత ఖండించారు. అయితే టీఎంసీ కనుమరుగయ్యే అవకాశం ఉందని, అది ఇకపై మనుగడ సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత 100 మంది కౌన్సిలర్లు తృణమూల్‌ను వీడారు. ఇప్పటికే పలువురు నేతలు కూడా టీఎంసీ నాయకత్వంపై ముఖ్యంగా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ వరుస పరిణామాలు టీఎంసీకి పొంచిఉన్న సంక్షోభానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. తృణమూల్ రెండుగా చీలనుందని, మహారాష్ట్ర పరిస్థితులే బెంగాల్‌లోనూ రానున్నాయని మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో భాజపా గెలుపు అనంతరం తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత, మాజీ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేపట్టారు. భాజపాకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడుతానని ఆమె శపథం చేశారు. దేశవ్యాప్తంగా భాజపాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు దిల్లీలో సమావేశమవుతాయి. ఎన్ని బెదిరింపులు వచ్చినా నిరసన కొనసాగుతుందని మమత స్పష్టంచేశారు. అయితే అధజకారంలో ఉండగా అత్తా అల్లుళ్ల ఆగడాలను నేతలతో పాటు ప్రజలు కూడా సమించారు. కానీ పరిస్తితి మారింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో వీరంతా తిరుగుబాటు జెండా ఎగరువేశారు. ఏ జెండాకు ఆగొడుగు పట్టి, నానా యాగీ చేయడం మమతా బెనర్జీ నైజం. మొన్నటి ఎన్నికల్లో అలాగే చేయబోయారు. కానీ బిజెపి పన్నిన ఉచ్చులో పడ్డ మమత గిలగిల కొట్టుకోవడం మినహా చేయగ లింది లేదు. మమతను ప్రజలే ఛీత్కరించుకునే స్థాయికి వచ్చింది.

# గిరిజనాభివృద్ధికి రాష్ట్రపతి పిలుపు

## జాతీయ సదస్సుకు ప్రారంభం

## గిరిజన సంక్షేమంపై దృష్టి

## వికసిత భారత్ లక్ష్య సాధన




**న్యూఢిల్లీ, జూన్ 3 :** గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధిని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో నిర్వహించిన జాతీయ సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలు, సమీకృత గిరిజనాభివృద్ధి ప్రాజెక్టుల బలోపేతంపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం న్యూఢిల్లీలో జరిగింది. గిరిజనుల సామాజిక, ఆర్థిక పురోగతికి సంబంధించి పలు కీలక అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్రపతి బెంగళూరులోని భారత విజ్ఞాన సంస్థలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని, ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాలల్లో ఏర్పాటు చేసిన డెబ్బై ఐదు అంతరిక్ష ప్రయోగశాలలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఆధునిక సాంకేతిక విద్యను గిరిజన విద్యార్థులకు చేరువ చేయడంలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. భారతదేశం రెండు వేల నలభై ఏడవ సంవత్సరానికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగుతోందని రాష్ట్రపతి అన్నారు. ఈ లక్ష్య సాధనలో గిరిజన సమాజాల సమగ్ర అభివృద్ధి అత్యంత కీలక భాగమని స్పష్టం చేశారు. దేశ అభివృద్ధిలో గిరిజనుల పాత్ర మరింత పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఉపయోగపడుతున్నాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. అయితే ఆ పథకాలపై పూర్తి అవగాహన కలిగి వాటి ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని గిరిజన ప్రజలకు సూచించారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్రపతి సూచించారు. యువత ఆధునిక విద్యను అభ్యసించి కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. గిరిజన విద్యార్థులు విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వివరించారు. సమగ్ర అభివృద్ధి ద్వారానే గిరిజన సమాజాలు మరింత బలోపేతం అవుతాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. గిరిజనుల సాధికారత, విద్యా ప్రగతి, ఆర్థిక స్వావలంబన ద్వారా వికసిత భారత్ నిర్మాణంలో వారు కీలక భాగస్వాములుగా ఎదగాలని ఆకాంక్షించారు.

# కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం

- ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్
- మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం
- సిద్ధరామయ్య, ఖర్గేల తనయులకు కేబినేట్‌లో చోటు
- కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్ , రేవంత్ రెడ్డి



**బెంగళూరు, జూన్ 3:** కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు. జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి. పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌కు రాజ్యాంగ రక్షణ లేదు

## సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, జూన్ 3:** ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ దానికి రాజ్యాంగ రక్షణ ఉండబోదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను సమర్థించింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉందని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజ హితం, శాంతి భద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా.. వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొంది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది.



## ఎస్టీ రిజర్వేషన్ల అమలులో విశాఖ పోర్ట్‌కు జాతీయ కమిషన్ ప్రశంసలు

**సంక్షేమ చర్యలు, ఉద్యోగుల హక్కుల పరిరక్షణపై సమీక్ష**

**పోర్టు చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శనీయం: అంతర్ సింగ్ ఆర్యా**

**విజయవాడ, జూన్ 3:** షెడ్యూల్డ్ ట్రైబ్స్‌కు సంబంధించిన రిజర్వేషన్ విధానం అమలు, రక్షణ చర్యలు మరియు సంక్షేమ కార్యక్రమాలపై విశాఖపట్నం పోర్ట్ అథారిటీ లో అమలు చేస్తున్న కార్యక్రమాలపై జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ ఛైర్మన్ అంతర్ సింగ్ ఆర్యా, కమిషన్ సభ్యులు పోర్ట్ అధికారులతో విజయవాడలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ ట్రైబ్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం మరియు రిజర్వేషన్ విధానం సమర్థవంతమైన అమలుకు పోర్ట్ చేపడుతున్న చర్యలు, కార్యక్రమాలపై పోర్ట్ అధికారులు ప్రెసెంటేషన్ ద్వారా కమిషన్ ఛైర్మన్, సభ్యకులకు వివరించారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఛైర్మన్ జస్మీత్ సింగ్ బింద్రా, ఐఆర్టీఎస్, కార్యదర్శి ఎం. శంకర్ బాబు, ఎస్సీ/ఎస్టీ అధికారుల, ఉద్యోగుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉమా మహేశ్వరరావు, దేవేశ్వరరావు, రామకృష్ణ, ఓ. రామలింగం, లైజన్ అధికారి బి. సాంబమూర్తి సమావేశంలో పాల్గొని, రిజర్వేషన్ విధానం అమలు, షెడ్యూల్డ్ ట్రైబ్స్ సంక్షేమానికి సంబంధించి పోర్ట్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీఎస్టీ ఛైర్మన్ అంతర్ సింగ్ ఆర్యా, సభ్యులు, ఉద్యోగుల ఫిర్యాదుల పరిష్కారం, సంక్షేమ చర్యలు, రిజర్వేషన్ విధానం అమలులో పోర్ట్ తో పాటు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘాలు చేస్తున్న కృషిని అభినందించారు. షెడ్యూల్డ్ ట్రైబ్స్‌కు సంబంధించిన రిజర్వేషన్ విధానం అమలు, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, పారదర్శకత మరియు భారత ప్రభుత్వ మార్గదర్శకాల అమలులో పోర్ట్ చేపడుతున్న కార్యక్రమాలు పోర్ట్ నిబద్ధతకు అద్దంపడుతున్నాయని అభినందించారు.

## కేజీ బేసిన్ పనులు వేగవంతం చేయాలి

**సీఎం చంద్రబాబుతో ఓఎన్‌జీసీ ఛైర్మన్ అరుణ్ కుమార్ సింగ్ భేటీ**

**ఇంధన రంగ విస్తరణ, ఉపాధి అవకాశాలపై కీలక చర్చ**



**అమరావతి, జూన్ 3 :** ఓఎన్‌జీసీ ఛైర్మన్ అరుణ్ కుమార్ సింగ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్ర సచివాలయానికి వచ్చిన ఆయన రాష్ట్రంలో ఓఎన్‌జీసీ చేపడుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యకలాపాలపై ముఖ్యమంత్రికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా- గోదావరి డెల్టా బేసిన్‌లో సహజవాయువు, చమురు అన్వేషణ, వెలికితీత పనుల పురోగతి సహా వివిధ అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రంలో ఇంధన రంగం అభివృద్ధికి ఓఎన్‌జీసీ చేస్తున్న కృషిని, తదుపరి విస్తరణ ప్రణాళికల గురించి అరుణ్ కుమార్ సింగ్ సీఎంకు వివరించారు. ఓఎన్‌జీసీ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి సమకూరే ఆదాయం, ఉపాధి అవకాశాలు స్థానిక ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావంపై సీఎం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, ఓఎన్‌జీసీ మధ్య మెరుగైన సమన్వయం ఉండేలా చూడాలని, తద్వారా ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ఇంధన భద్రతను పెంపొందించడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. సామాజిక బాధ్యతగా ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులను ఆయా గ్రామాల్లో ఖర్చు పెట్టాలని సీఎం సూచించారు. చమురు సహజవాయువు తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఓఎన్‌జీసీ ఛైర్మన్ కాకినాడ, గుంటూరులో కేన్సర్ చికిత్సల్లో వినియోగించే అధునాతన యంత్రాలను ఆస్పత్రులకు సమకూరుతున్నట్టు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశానికి రాష్ట్ర పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఓఎన్‌జీసీ అధికారుల బృందం హాజరయ్యారు.

## తిరుమల కల్తీ నెయ్యి కేసు

**దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇడి సోదాలు**

**తిరుపతి, జూన్ 3:** తిరుమల కల్తీ నెయ్యి కేసుకు సంబంధించి ఈడీ అధికారులు దేశంలోని 15 ప్రాంతాల్లో సోదాలు చేశారు. గుంటూరు, దిల్లీ, ముంబయి, రాజ్‌కోట్, బికనీర్, డెహ్రాదూన్, రూర్కీ, అహల్యానగర్, దిండిగల్ తదితర ప్రాంతాల్లో పలువురి నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేశారు. పోమిల్ జైన్, విపిన్ జైన్, రాజు రాజశేఖరన్, రాజేశ్ మన్సుఖ్‌లాల్, అపూర్వ వినయ్‌కాంత్, శాంతారామ్, అజయ్ కుమార్, మహేశ్‌కుమార్, ఆశిష్ అగర్వాల్ ఇళ్లలో సోదాలు చేసి రూ.60 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. స్థిర, చరాస్తుల్లో రూ.45 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టినట్లు గుర్తించారు.



# విశాఖ-కాకినాడ తీరంలో భారీ కెమికల్ ప్లాంట్

- రష్యా దిగ్గజానికి లోకేష్ ఆహ్వానం
- ప్రముఖ రసాయన సంస్థ రస్ కెమ్ గ్రూప్‌తో కీలక భేటీ
- పోర్టు ఆధారిత లాజిస్టిక్స్ హబ్ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి
- లోకేష్ ప్రతిపాదనలపై ఉన్నతస్థాయిలో చర్చిస్తామన్న రస్ కెమ్ ప్రతినిధులు
- రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా రష్యా పర్యటనలో మంత్రి నారా లోకేష్ కృషి




**అమరావతి, జూన్ 3:** రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్, మాస్కోలో కీలక సమావేశం నిర్వహించారు. రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, మిథనాల్ కెమికల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్, అంతర్జాతీయ వ్యాపార విభాగాధిపతి దర్యా అషానియాలతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "భారత్ దిగుమతి చేసుకునే పెట్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు వీలుగా, భారత తూర్పు తీరంలోని విశాఖ-కాకినాడ పీసీపీఐఆర్ పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యంలో ఒక అత్యాధునిక ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయండి" అని ఆహ్వానించారు. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణం, బల్క్ కెమికల్ స్టోరేజీ వసతులు, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్త్‌ల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఏపీలో అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఒక కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్, మెటీరియల్ సైన్స్ పరిశోధన కేంద్రాన్ని స్థాపించాలని సూచించారు. రస్ కెమ్ టెక్నాలజీతో పునరుత్పాదక ఇంధన కారిడార్లను అనుసంధానిస్తూ, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే రసాయనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ప్రత్యేక ఎస్‌పీవీల ద్వారా హోల్‌సేల్ కెమికల్ పంపిణీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, ఇప్పటికే ముంబై, కాన్పూర్‌లలోని పంపిణీ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ సరఫరా కేంద్రం ద్వారా విశాఖపట్నం, కాకినాడలోని ఫార్మా, తయారీ పరిశ్రమలకు కీలక రసాయనాలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోని భారీ పెట్రోకెమికల్ ప్లాంట్లను ఉపయోగించుకుని తమ గ్లోబల్ ఖాతాదారులకు స్థిరమైన సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి నారా లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని ఇల్యా కోసిహ్ తెలిపారు.

# గిగాచాట్, యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్ పై కీలక ప్రతిపాదనలు

- మాస్కోలో రష్యా స్బేర్‌బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్‌తో మంత్రి లోకేష్ భేటీ
- భారత్‌లో గిగాచాట్ ఏఐ, బ్యాంకింగ్ భద్రత టెక్నాలజీపై కీలక ప్రతిపాదనలు
- విశాఖ ఫార్మా, వ్యవసాయ ఎగుమతిదారులకు ప్రత్యేక రుణాలు అందించాలని విజ్ఞప్తి
- భారత్‌లో తమ కార్యకలాపాలను వివరించిన స్బేర్‌బ్యాంక్ ప్రతినిధి
- లోకేష్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని తెలిపిన బ్యాంక్ యాజమాన్యం



**అమరావతి, జూన్ 3 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ రష్యా పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రభుత్వ నియంత్రణలోని అతిపెద్ద రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్‌తో కీలక చర్చలు జరిపారు. మాస్కోలో స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో భేటీ అయిన లోకేష్, భారత్‌లో బ్యాంకింగ్, టెక్నాలజీ, స్మార్ట్ సిటీ రంగాలలో సహకారానికి సంబంధించి పలు ముఖ్యమైన ప్రతిపాదనలు చేశారు. ఈ సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ... స్బేర్‌బ్యాంక్ అభివృద్ధి చేసిన 'గిగాచాట్ ఎల్‌ఎల్‌ఎం'ను భారత బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు విస్తరించాలని కోరారు. పాశ్చాత్య ప్లాట్‌ఫారమ్‌లకు ఇది ఒక సురక్షితమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, దేశంలోని యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) నెట్‌వర్క్ భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు, స్బేర్‌బ్యాంక్ యొక్క అత్యాధునిక వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారత బ్యాంకింగ్ వ్యవస్థలో ఇంటిగ్రేట్ చేయడానికి సాంకేతిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. భారత్‌లో కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా మున్సిపల్ కార్యకలాపాలను మెరుగుపరచడానికి స్బేర్‌బ్యాంక్ ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్ వంటి డిజిటల్ పరిష్కారాలను అందించాలని లోకేష్ సూచించారు. ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజనీర్లను వేగంగా తీర్చిదిద్దేందుకు స్బేర్‌బ్యాంక్ యొక్క ప్రత్యేక శిక్షణా విధానమైన 'స్కూల్ 21' కోడింగ్ అకాడమీలను భారత్‌లోని ప్రధాన విద్యా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా, వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలోని ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం రూపాయి-రూబుల్ వాణిజ్యానికి అనుమతులు ఇవ్వడంతో పాటు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో తమ కార్యకలాపాలను వివరిస్తూ, న్యూఢిల్లీలోని కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక వాణిజ్య ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. బెంగళూరులోని తమ ఐటీ హబ్, రూపాయి-రూబుల్ వాణిజ్య లావాదేవీలకు సమన్వయ కేంద్రంగా పనిచేస్తోందని చెప్పారు. న్యూఢిల్లీ, ముంబైలోని తమ శాఖలు వ్యూహాత్మక వాణిజ్య కారిడార్లలో మౌలిక సదుపాయాల పెట్టుబడులకు గేట్‌వేలుగా ఉన్నాయని వివరించారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని యెఫిమోవ్ హామీ ఇచ్చారు. మాస్కో కేంద్రంగా పనిచేస్తున్న స్బేర్‌బ్యాంక్, రిటైల్ బ్యాంకింగ్‌తో పాటు క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో విస్తరించిన భారీ సంస్థ. ప్రపంచవ్యాప్తంగా 11 కోట్లకు పైగా రిటైల్, 35 లక్షల కార్పొరేట్ ఖాతాదారులను కలిగి ఉన్న ఈ బ్యాంకు, 12,000 శాఖలతో ప్రతిరోజూ 8 కోట్ల మంది డిజిటల్ వినియోగదారులకు సేవలందిస్తోంది.

# ప్రతిష్టాత్మకంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

- జిల్లాకో ప్రత్యేక థీమ్... టూరిజం ప్రాంతాల వేదికగా యోగా డే
- జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్రంలో యోగాంధ్ర కార్యక్రమాలు
- పవన్ కళ్యాణ్ పై తెలంగాణ నేతల వ్యాఖ్యలు సరి కావు
- తమిళనాడుతో నాతో సహా వివిధ రాష్ట్రాల నేతలు ప్రచారం చేయలేదా?
- ఏ ప్రాంతానికి ఎవరేం చేశారో తెలుసు
- డీఎస్సీ నిర్వహణ అనేది టీడీపీ బ్రాండ్
- మంచి పనులపై బురద జల్లడమే పని
- మీడియా సమావేశంలో చంద్రబాబు



**అమరావతి, జూన్ 3 :** రాష్ట్రంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీన 'యోగాంధ్ర-2026' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అమరావతిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది 'యోగా ఫర్ హెల్తీ అగైనింగ్' అనే థీమ్‌తో రాష్ట్రవ్యాప్తంగా కోటి మందిని భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. జూన్ 7 నుంచి 20 వరకు 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు జరుగుతాయని, అమరావతిలోని కృష్ణా నది వెస్ట్ బైపాస్ వంతెనపై 25 వేల మందితో ప్రధాన యోగా ప్రదర్శన ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని 56 ప్రముఖ పర్యాటక మరియు చారిత్రక ప్రాంతాలైన ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి వేదికలపై ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించి యోగా-టూరిజాన్ని ప్రోత్సహిస్తామని, ఇందుకోసం రూ.10 కోట్ల బడ్జెట్ కేటాయించామని వివరించారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా యోగాను ప్రజారోగ్య ఉద్యమంగా తీర్చిదిద్దుతూ, రాష్ట్రంలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను తయారు చేయడంతో పాటు ట్రైనర్ల సంఖ్యను 2.50 లక్షలకు పెంచుతామన్నారు. ప్రజలకు శిక్షణ ఇచ్చేందుకు సంజీవని యాప్, ఏపీ యోగా ప్రచార పరిషత్ పోర్టల్‌తో పాటు వాట్సాప్ నంబర్ 81424 04888 ద్వారా ఉచితంగా యోగా వీడియోలు అందుబాటులో ఉంచుతున్నామని, దీని పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సాయం తీసుకుంటున్నట్లు సీఎం పేర్కొన్నారు. గత ఏడాది విశాఖలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి 2.44 కోట్ల మంది నమోదు చేసుకోగా, 1.91 కోట్ల మందికి సర్టిఫికెట్లు అందించామని ఆయన గుర్తుచేశారు. ఇదే సమావేశంలో ఇటీవల తెలంగాణలో పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి కొందరు నేతలు చేసిన విమర్శలపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. విభజన జరిగి 12 ఏళ్లు దాటిన తర్వాత కూడా తెలంగాణలోని కొందరు నాయకులు అనవసర అంశాలను మాట్లాడుతూ ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం సరికాదని హితవు పలికారు. గతంలో తాను తమిళనాడులో ఎన్నికల ప్రచారం చేశానని, కర్ణాటకకు చెందిన డీకే శివకుమార్ సహా వివిధ రాష్ట్రాల జాతీయ నేతలు కూడా అక్కడ ప్రచారం చేశారని గుర్తుచేశారు. గతంలో బీఆర్ఎస్ పార్టీని నేషనల్ పార్టీగా ప్రకటించి ఆంధ్రప్రదేశ్‌లో కూడా తమ శాఖను ఏర్పాటు చేశారని, మరి ఇప్పుడు తెలంగాణ నేతలు ఎందుకు ఇలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని నిలదీశారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు అనేక దేశాల్లో అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఉంటూ సేవలు అందిస్తున్నారని చెబుతూ, అభివృద్ధి మరియు ప్రజాసేవలో పోటీ పడాలి తప్ప ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం తగదని స్పష్టం చేశారు. చివరగా ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విమర్శలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. డీఎస్సీ ద్వారా పారదర్శకంగా ఉద్యోగాల నియామకాలు చేపట్టడం అనేది తెలుగుదేశం పార్టీ బ్రాండ్ అని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి రాగానే మొదటి సంతకం చేసి నియామక ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కేటగిరీల ఆధారంగానే స్పోర్ట్స్ కోటా నియామకాలు జరిగితే, క్రీడలపై కనీస అవగాహన లేని కొందరు తమ పేటిఎం బ్యాచ్‌ల ద్వారా లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యత కలిగిన రాజకీయ పార్టీగా నిజాలు తెలుసుకుని మాట్లాడాలి తప్ప, ప్రభుత్వం చేసే ప్రతి మంచి పనిపై మరియు యోగాంధ్ర బడ్జెట్‌పై బురదజల్లడమే పనిగా పెట్టుకుంటే ప్రజలే వారిని బహిష్కరిస్తారని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

# జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి మరో మైలురాయి

**హత్నూర మండలం బోరపట్ల శివారులో తెరానిమ్ బయోలాజిక్స్ యూనిట్ ను ప్రారంభించిన మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ**

**సంగారెడ్డి, జూన్ 3( సమయం న్యూస్). :** తెరానిమ్ బయోలాజిక్స్ యూనిట్ ప్రారంభం ద్వారా తెలంగాణ బయోఫార్మా రంగంలో మరో కీలక ముందడుగు పడిందని, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఇది నూతన ఊతాన్ని అందిస్తుందని మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోరపట్ల శివారులో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన తెరానిమ్ బయోలాజిక్స్ (TheraNym Biologics) తయారీ యూనిట్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, పారదర్శక విధానాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉండటంతో ప్రపంచ స్థాయి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని తెలిపారు.బయోటెక్నాలజీ, ఔషధ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే దేశంలో అగ్రగామిగా నిలిచిందని, ఔషధ రంగంలో ఆధునిక సాంకేతికతతో కూడిన తెరానిమ్ బయోలాజిక్స్ వంటి సంస్థల రాకతో రాష్ట్రం అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు పొందుతుందని పేర్కొన్నారు. ఈ సంస్థ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదం చేస్తుందని అన్నారు.మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ అత్యాధునిక బయోలాజికల్ ఔషధాల తయారీలో ఈ యూనిట్ కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు ఇలాంటి సంస్థలు బలాన్ని చేకూరుస్తాయని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా ఔషధ, బయోటెక్నాలజీ రంగాలకు ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని, పరిశ్రమల విస్తరణతో పాటు స్థానిక ప్రజల జీవనోపాధి అవకాశాలు కూడా గణనీయంగా మెరుగుపడతాయని తెలిపారు. పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలని సంస్థలకు సూచించారు.ఈ కార్యక్రమంలో టి జి ఐ ఐ సి చైర్ పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి,

సంస్థ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు,జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ కలెక్టర్ పాండు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్ మున్సిపల్ నూతన కమిషనర్ గా రాకేష్ రెడ్డి బాధ్యత స్వీకరణ




ప్రజలకు అందుబాటులో ఉంటా పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తా మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి.

**తాండూరు మున్సిపల్, జూన్ 3(సమయం న్యూస్) :** వికారా బాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ కమిషనర్ గా పి రాకేష్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు.బుధవారం కమిషనర్ ఛాంబర్ లో ఛార్జిన్ని తీసుకున్నారు. చార్జి తీసుకున్న అనంతరం పి. రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు సహకారంతో పట్టణ అభివృద్ధి చేపడతారని తెలిపారు. మోడల్ మున్సిపాలిటీగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తానని ఆయన వివరించారు. అనంతరం చైర్మన్ పి. నీరజను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు మేనేజర్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు, వార్డ్ ఆఫీసర్లు సిబ్బంది, కమిషనర్ ని సన్మానించారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాలసొంతింటికల సాకారం సర్పంచ్

**● కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శాంత కుమార్ పటేల్**



**సమయం న్యూస్ జూన్03** రాయికోడ్ మండల పరిధిలోని ధర్మాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన గ్రామ సర్పంచ్ రమాదేవి పాండురంగ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శాంత కుమార్ పటేల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మైనార్టీ నాయకులు పంచాయతీ కార్యదర్శి ఖదీర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు మరింత సమర్థవంతమైన,పారదర్శకమైన పోలీసింగ్ సేవలను అందించడమే ప్రధాన లక్ష్యం.

**● వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**






**తాండూర్, మున్సిపల్, జూన్,03(సమయం న్యూస్) :** ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ సేవలను అందించడమే ప్రధాన లక్ష్యంగా వికారాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ బుధవారం తాండూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణ, రికార్డుల భద్రత మరియు సిబ్బంది విధి నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. ముఖ్యంగా స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసుల పురోగతి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, హిస్టరీ షీట్లు, ఆర్డర్ బుక్, బీట్ బుక్స్, వారెంట్ల అమలు స్థితిగతులతో పాటు స్వాధీనం చేసుకున్న ఆస్తుల రికార్డులు,కేసు ప్రాపర్టీల భద్రత వంటి పలు కీలక అంశాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు మరియు పోలీసులకు-ప్రజలకు మధ్య ఎలాంటి అంతరాలు లేకుండా నిరంతరం అందుబాటులో ఉండే విధంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్‌లో ఎలాంటి రికార్డులను పెండింగ్‌లో పెట్టకూడదని, ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లల రక్షణ మరియు వారిపై జరిగే నేరాల కేసుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉంటూ, ప్రత్యేక నిఘా ఉంచాలని, బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. శాస్త్ర సాంకేతికతను జోడించి రాత్రి వేళల్లో గస్తీ నిరంతరం కొనసాగించాలని, పాత నేరస్థుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని పేర్కొన్నారు.రాబోయే ప్రతిష్టాత్మక బోనాలు మరియు మొహర్రం పండుగలను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ శాంతిభద్రతల పరిరక్షణపై అధికారులకు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. పట్టణంలోని సమస్యాత్మక, ముఖ్యమైన ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాల నిఘాను మరింత బలోపేతం చేయాలని, జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు వచ్చే విధంగా పనిచేయాలని సిబ్బందికి తెలియజేయడం జరిగింది.ఇట్టి కార్యక్రమం లో తాండూర్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్,ఎస్సై లు,ఇతర సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

# ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు

**● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**



**మక్తల్ మున్సిపల్, జూన్,03(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి (సీఎం) 4వ తేదీ గురువారం రోజు నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణం మరియు కాట్రేవుపల్లి మక్తల్, నారాయణపేట కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ఏరియల్ సర్వే, పనులను పరిశీలించడం కోసం రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.మక్తల్‌లోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ..నారాయణపేట జిల్లా పోలీసులతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, వికారాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట, నల్గొండ జిల్లాల నుండి వచ్చిన పోలీసు బలగాలతో కలిపి మొత్తం 600 మంది పోలీసులను బందోబస్తు విధుల్లో నియమించినట్లు తెలిపారు.ఈ బందోబస్తులో 01 అదనపు ఎస్పీ, 07 డీఎస్పీలు, 19 సీఐలు, 52 ఎస్సైలు, 71 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, సుమారు 400 మంది కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, హోం గార్డులు పాల్గొంటున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను మొత్తం 11 సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌కు అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐ లను ఇన్‌చార్జీలుగా నియమించినట్లు తెలిపారు. భద్రతా విధుల్లో ఉన్న అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ, ప్రతి అంశాన్ని నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు .హెలిప్యాడ్ నుండి కాన్వాయ్ మార్గం ద్వారా మక్తల్ మండలం కాట్రేవుపల్లి శివారులోని లిఫ్ట్ స్టేజ్-1 వరకు రోడ్ ఓపెనింగ్ పార్టీలు, తాఖీ బృందాలు, పెట్రోలింగ్ టీములు, ట్రాఫిక్ డైవర్షన్ సిబ్బంది, రూఫ్‌టాప్ సెంట్రీలు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు, పార్కింగ్ నిర్వహణ సిబ్బందిని మోహరించినట్లు ఎస్పీ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని విధుల్లో ఉన్న సిబ్బందికి సూచించారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి తాగునీరు, భోజన వసతులు, బయటి జిల్లాల నుండి వచ్చిన పోలీసు సిబ్బందికి వసతి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని, ప్రతి పోలీసు అధికారి మరియు సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తి అప్రమత్తతతో నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, భద్రతా లోపాలు తలెత్తకుండా రూట్ మానిటరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ట్రాఫిక్ నియంత్రణను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు ఎన్. లింగయ్య, నాగేష్, ప్రసాద్,శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ సీఐలు, ఎస్సైలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరి ధాన్యం సేకరణకు రైస్ మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలి

**● జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి**






**వికారాబాద్, జూన్,03(సమయం న్యూస్) :** వరి ధాన్యం సేకరణకు రైస్ మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి తెలిపారు.బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో వరి ధాన్యం సేకరణపై రైస్ మిల్లర్లు, లారీ ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లతో సమన్వయ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి మాట్లాడుతూ...జిల్లాలోని ప్రతి మిల్లరు 2 లక్షల 20 వేల బస్తాల ధాన్యాన్ని తీసుకునే విధంగా అన్ని సిద్ధం చేసుకోవాలన్నారు.జూన్ 6వ తేదీ వరకు లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి ధాన్యంమును మిల్లర్లు సేకరించాలని ఆయన తెలిపారు. జిల్లాలో గల 130 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి ఎప్పటికప్పుడు మిల్లర్లకు తరలించే విధంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణలో ఎలాంటి అశ్రద్ధ చూపకుండా ధాన్యం సేకర జరగాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మిల్లుల వద్ద ధాన్యం దించుకోవడంలో జాప్యం అవుతుందని, హమాలీల సంఖ్యను పెంచుకొని సమస్యను అధిగమించాలని ఆయన తెలిపారు.లారీ ట్రాన్స్ పోర్టు కాంట్రాక్టర్లు ధాన్యాన్ని మిల్లులకు సకాలంలో చేర్చేందుకు లారీల సంఖ్యను కూడా పెంచుకోవాలని ఆయన సూచించారు.వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని ఆయన తెలిపారు.వరి కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు, తూనిక, తేమ యంత్రాలు ఉండేవిధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు.వరి ధాన్యం నిల్వల నిమిత్తం అదనంగా మధ్యంతర గోదాములకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల జనరల్ మేనేజర్ అభిషేక్, డీజీఎం ఇర్ఫాన్, సూపరింటెండెంట్ ఇద్రీష్,పౌర సరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా సహకార అధికారి నాగార్జున, డిసిఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ వెంకట్ రామ్ రెడ్డి, అదనపు డిఆర్డిఓ నర్సింలు, డిపిఎం కొమురయ్య, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బాలేశ్వర్ గుప్త, శ్రీధర్ రెడ్డి, రైస్ మిల్లర్లు, లారీ ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# ఎంజీఎం సమస్యల పరిష్కారానికి అభివృద్ధి కమిటీ సమీక్ష

## ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడమే వైద్యుల బాధ్యత: మంత్రి కొండా సురేఖ



**వరంగల్, జూన్ 3: ( సమయం న్యూస్) :** ఎంజీఎం ఆస్పత్రిలో నెలకొన్న మౌలిక వసతులు, సిబ్బంది కొరత, వైద్య పరికరాల అవసరాలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహణ అంశాలపై బుధవారం జిల్లా కలెక్టర్, ఎంజీఎం అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఎంజీఎం ఆస్పత్రిలో ఉన్న సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రికి అవసరమైన నిధులు, పరికరాల సమీకరణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శిథిలావస్థకు చేరుకున్న నర్సింగ్ స్కూల్ భవనం, సిబ్బంది భర్తీ, పరికరాల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఎంజీఎం ఆస్పత్రి ఉత్తర తెలంగాణ ప్రజలకు ఆరోగ్య భరోసాగా నిలుస్తోందని అన్నారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని సూచించారు. ఆస్పత్రి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పీఎంఎస్-ఎస్‌వై పథకం కింద మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. న్యూరో సర్జరీ సేవలను బలోపేతం చేయడంతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నైపుణ్యం కలిగిన వైద్యులను నియమించి కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలని కోరారు. ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఆస్పత్రుల అభివృద్ధి, నాణ్యమైన వైద్య సేవల అందుబాటుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా నిరంతర సమీక్షలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# నిబంధనల మేరకు నిర్మాణాలు పూర్తిచేస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల మంజూరు

**● జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్**



**హనుమకొండ, జూన్ 3:( సమయం న్యూస్) :** నగర పరిధిలో నిర్మించిన భవనాలకు సంబంధించిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల మంజూరులో నిబంధనలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీకి సంబంధించి బుధవారం ఖాజీపేటలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సమీపంతో పాటు కాజీపేట రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిర్మించిన పలు భవన సముదాయాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భవన యజమానులు సమర్పించిన పత్రాలను పరిశీలించడంతో పాటు, నిర్మాణాలకు సంబంధించిన కొలతలు, సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్ సౌకర్యాలు మరియు ఇతర సాంకేతిక ప్రమాణాలను స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలు, భవన నిర్మాణ అనుమతి షరతులు మరియు సాంకేతిక ప్రమాణాలను పూర్తిస్థాయిలో పాటించిన భవనాలకే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేయబడతాయని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, నగర ప్రణాళికాబద్ధ అభివృద్ధి దృష్ట్యా ప్రతి నిర్మాణాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. దరఖాస్తుదారులు సమర్పించిన వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించిన అనంతరమే తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. భవన యజమానులు నిర్మాణాల సమయంలో అనుమతులకు అనుగుణంగా పనులు చేపట్టి నగరాభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ పరిశీలనలో సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, టౌన్ ప్లానింగ్ అధికారులు అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్ నియోజకవర్గంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు

## కేక్ కట్ చేసిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి





**దౌల్తాబాద్ మండలం, జూన్ 03(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు. బిఆర్ఎస్ పార్టీ అగ్ర నేత తన్నీరు హరీష్ రావు జన్మదిన సందర్భంగా బుధవారం కొడంగల్ మాజీ శాసనసభ్యులు పట్నం నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కేంద్రం ఫంక్షన్ హాల్ లో కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలోకొడంగల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆర్ మధు సూదన్ యాదవ్ దౌల్తాబాద్ మాజీ జడ్పిటిసి కోట్ల మైపాల్ ముదిరాజు మద్దూరు మండల అధ్యక్షుడు వేణుగోపాల్ దౌల్తాబాద్ మాజీ వైస్ ఎంపీపీ మైపాల్ రెడ్డి. నరేష్ గౌడ్ తోక ఆశప్ప మాటూరు బీములు భీమశంకర్ బొంరస్ పేట మండల్ నాయకులు మాజీ సమన్వయ కమిటీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ సేరి నారాయణరెడ్డి. బీసీ సెల్ అధ్యక్షులు రవి గౌడ్. యూత్ ప్రెసిడెంట్. ఉప్పరి మహేందర్.. ఎనికేపల్లి మాజీ ఉపసర్పంచ్ రవీందర్ గౌడ్. వి రవీంద్ర చారి. చిన్ననందిగామ మల్లేష్ చెన్నకేశవులు నరేందర్ ప్రవీణ్ రాజేశ్ దీపక్ మనోహర్. రాఘవేందర్ అరవింద్. మోహన్ గోపాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# సికింద్రాబాద్ డివిజనల్ ప్రధాన కార్యాలయాన్ని తనిఖీ చేసిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్





**సికింద్రాబాద్, జూన్ 3: (సమయం న్యూస్)** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం సికింద్రాబాద్ డివిజనల్ ప్రధాన కార్యాలయం (సంచాలన్ భవన్)ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ డివిజన్ డీఆర్ఎం డా. ఆర్. గోపాలకృష్ణన్‌తో పాటు దక్షిణ మధ్య రైల్వే ప్రధాన విభాగాధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. దక్షిణ తీర రైల్వే (సౌత్ కోస్ట్ రైల్వే) కొత్త జోన్ ఏర్పాటుతో జూన్ 1 నుంచి వాడి--రాయచూర్, పగిడిపల్లి--విష్ణుపురం--జనపహాడ్ సెక్షన్లు సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోకి వచ్చాయి. అదే సమయంలో మోటమర్రి--కొండపల్లి సెక్షన్‌ను విజయవాడ డివిజన్‌లో విలీనం చేశారు. ఈ నేపథ్యంలో కొత్తగా చేర్చిన సెక్షన్లలో రైలు కార్యకలాపాల పర్యవేక్షణ కోసం డివిజనల్ కంట్రోల్ కార్యాలయంలో రెండు అదనపు సెక్షన్ కంట్రోల్ బోర్డులను ఏర్పాటు చేశారు. జనరల్ మేనేజర్ కొత్త కంట్రోల్ బోర్డులను పరిశీలించి, విస్తరించిన అధికార పరిధిలో రైళ్ల కదలికల పర్యవేక్షణకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. నెట్‌వర్క్ వ్యాప్తంగా రైలు సేవలు సురక్షితంగా, సమర్థవంతంగా, సమయపాలనతో కొనసాగేందుకు నిరంతర పర్యవేక్షణ, సమన్వయం అవసరమని సూచించారు. అనంతరం ట్రాక్షన్ పవర్ కంట్రోల్ రూమ్, టెలికాం టెస్ట్ రూమ్‌లను తనిఖీ చేశారు. లోకోమోటివ్‌లకు విద్యుత్ సరఫరా, ఓవర్‌హెడ్ పరికరాల పనితీరు, కమ్యూనికేషన్ వ్యవస్థల నిర్వహణపై అధికారులతో చర్చించారు. తదుపరి హవామహల్‌లో నిర్వహించిన సోనార్ (స్టాఫ్ ఓరియంటేషన్ అండ్ న్యూ అడ్మినిస్ట్రేటివ్ రియలైన్‌మెంట్) కార్యక్రమంలో పాల్గొన్న జీఎం, ఆపరేటింగ్, కమర్షియల్, ఇంజనీరింగ్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్స్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, వైద్య విభాగాలకు చెందిన సిబ్బంది, అధికారులతో సమావేశమయ్యారు. పునర్వ్యవస్థీకరణను వృత్తిపరమైన అభివృద్ధికి అవకాశంగా స్వీకరించాలని సూచించిన ఆయన, సిబ్బంది సమస్యలను సత్వరమే పరిష్కరించి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# కొడంగల్ సబ్ ట్రెజరీ సీనియర్ అసిస్టెంట్ మనోజ్ కుమార్ ను ఘన సన్మానం!





PRTUTS కొడంగల్ మరియు TSGREA సంఘాల ప్రతినిధులు సన్మానం

**కొడంగల్ మున్సిపల్, జూన్,03(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ సబ్ ట్రెజరీ (ాబఎ-ుతీఝుంబతీఎ) కార్యాలయంలో 9 సంవత్సరాలకు పైగా సీనియర్ అసిస్టెంట్‌గా విశేష సేవలందించి, బదిలీపై వెళ్తున్న మనోజ్ కుమార్ ను బుధవారం ా=ుఖూ కొడంగల్ మరియు ూ+=జూా సంఘాల ప్రతినిధులు సంయుక్తంగా ఘనంగా సన్మానించారు. ఈ సుదీర్ఘ కాలంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు వారు అందించిన సహకారం, సేవలు ఎంతో అభినందనీయం. వారి నూతన ఉద్యోగ బాధ్యతలలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము! ఈ కార్యక్రమం లో పీఆర్టీయూ సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ హాక్ దినేష్ సింగ్ ఏసురత్నం తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటయ్య రాధాకృష్ణ యాదగిరి గోపీనాథ్ మురళి తదితరులు పాల్గొన్నారు

# వరి బదులు పప్పుధాన్యాల సాగు చేయాలి

**● డీఏఓ బత్తిన శ్రీనివాస్**

**పెద్దపల్లి, జూన్ 3:( సమయం న్యూస్) :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో రైతులు వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా పప్పుధాన్యాల పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బత్తిన శ్రీనివాస్ సూచించారు. పెద్దపల్లి కలెక్టరేట్‌లో విత్తన, ఎరువులు, పురుగుమందుల డీలర్లతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నకిలీ విత్తనాల నియంత్రణ కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ బృందం 24 గంటల పాటు పర్యవేక్షణ చేపట్టి, రాత్రి వేళల్లోనూ తనిఖీలు నిర్వహిస్తుందని చెప్పారు. నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఎరువుల విక్రయాలు తప్పనిసరిగా ఈ-పాస్ యంత్రాల ద్వారానే నిర్వహించాలని డీలర్లకు సూచించారు. సమావేశంలో వ్యవసాయ, సహకార, పోలీసు, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈ-సాండ్ పోర్టల్ ప్రారంభం.. ఇసుక సరఫరాలో పారదర్శకతకు పెద్దపీట

**● జిల్లా కలెక్టర్**



**జనగామ, జూన్ 3: ( సమయం న్యూస్). :** జిల్లాలో నిర్మాణ పనులకు అవసరమైన ఇసుకను వేగంగా, పారదర్శకంగా ప్రజలకు అందించేందుకు రూపొందించిన ఈ-సాండ్ బుకింగ్ పోర్టల్ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక, మొరం వంటి ఖనిజాలను మీ-సేవా కేంద్రాలు, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలు, కలెక్టరేట్ ద్వారా సులభంగా బుక్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టడం, ప్రజలకు నిర్ణీత ధరలకు నాణ్యమైన ఖనిజాలను అందించడం ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యమని చెప్పారు. జిల్లాలో ఇసుక ధర క్యూబిక్ మీటర్‌కు రూ. 450, మొరం ధర రూ. 428గా నిర్ణయించినట్లు వెల్లడించారు. రోజుకు 32 స్లాట్లు అందుబాటులో ఉండగా, చెల్లింపులు క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ విధానంలో చేయవచ్చని తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా ఖనిజాల సరఫరాలో పారదర్శకత పెరగడంతో పాటు అక్రమ రవాణాపై సమర్థవంతమైన నియంత్రణ సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# బడిబాటతో విద్యార్థుల నమోదు 10% పెంచాలి

**● విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణి**





**పెద్దపల్లి, జూన్ 3( సమయం న్యూస్). :** బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి ప్రతి పాఠశాలలో కనీసం 10 శాతం మేర విద్యార్థుల నమోదును పెంచాలని విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణి సూచించారు. జిల్లాల విద్యాశాఖ పనితీరుపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ, ఎఫ్ఎల్ఎన్, అకడమిక్ పనితీరులో పెద్దపల్లి జిల్లా సాధిస్తున్న పురోగతిని ప్రశంసించారు. ఉపాధ్యాయుల పనితీరుపై నిరంతర సమీక్షలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొంటూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో కూడా ప్రవేశాల పెంపుపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అల్పాహార పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం వంటి ప్రభుత్వ విద్యా సంక్షేమ కార్యక్రమాలపై తల్లిదండ్రులు, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. డిగ్రీ స్థాయిలో నైపుణ్యాధారిత విద్యకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం, యువత ఉపాధి అవకాశాల పెంపునకు చర్యలు తీసుకుంటోందని యోగితా రాణి తెలిపారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం

## ఎకరానికి రూ. లక్షకు పైగా ఆదాయం.. గెలల ధర రూ.23,852

**మహబూబాబాద్, జూన్ 2:( సమయం న్యూస్).** మహబూబాబాద్ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభసాటిగా మారుతోంది. ప్రస్తుతం జిల్లాలో 8,900 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతుండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 2,500 ఎకరాల్లో విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నారు.ప్రస్తుతం ఆయిల్ పామ్ గెలల ధర టన్నుకు రూ.23,852కు చేరుకోవడంతో రైతులు ఎకరానికి రూ.లక్షకు పైగా ఆదాయం పొందుతున్నారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ఎకరానికి రూ.52 వేల వరకు రాయితీ అందిస్తోంది.అంతర పంటలుగా జామ, నేరేడు, పనస, సీతాఫలం, సపోటా, టమాటా, వంకాయ, బెండ, బీరకాయ, సొరకాయ, ఉల్లి, చిక్కుడు, దోసకాయ, ఆకుకూరలు సాగు చేయాలని అధికారులు సూచించారు. అలాగే మల్చింగ్, బిందు సేద్యం, నీటి కుంటల వంటి పథకాలపై లభించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు




**జయశంకర్ భూపాలపల్లి, జూన్ 3( సమయం న్యూస్). :** ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ, భూపాలపల్లి జిల్లా నోడల్ అధికారి, పర్యావరణ శాస్త్రవేత్త శ్రీకాంత్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు. "ఘన వ్యర్థాల నిర్వహణ" మరియు "సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన" అంశాలపై వ్యాసరచన, చర్చ, డిబేట్, కొటేషన్స్, ఉల్లేఖన పోటీలు నిర్వహించారు.కార్యక్రమంలో కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ రమేష్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, ఇతర సిబ్బంది మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# స్వచ్ఛ గ్రామం, సురక్షిత జలవాయు పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**భూపాల పల్లి జూన్3( సమయం న్యూస్). :** జూన్ 1 నుంచి 5 వరకు కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలిప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛ గ్రామం, సురక్షిత జలవాయు' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 1 నుంచి జూన్ 5 వరకు రోజువారీ కార్యాచరణలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.వ్యర్థాలను పొడి, తడి, వైద్య, ప్రత్యేక వ్యర్థాలుగా విభజించి పర్యావరణానికి అనుకూలంగా నిర్వహించడం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్డీఓ బాలకృష్ణ, డీపీఓ శ్రీలత, జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్



**మద్దూరు మండలం, జూన్, 03(సమయం న్యూస్) :** మండల పరిధిలోని క్యాతన్ పల్లి గ్రామములోని పదవ వార్డులో బుధవారం రోజు గ్రామ సర్పంచ్ కావలి గోవిందు నూతన సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసిన్నారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కీ ప్రతిఒక్కరు సహకరించాలన్నారు మరెన్నో అభివృద్ధి పనులు చేస్తామన్నారు.ఈ కార్యక్రమం కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాల్ రెడ్డి. పంచాయతీ కార్యదర్శి సీత . వార్డు సభ్యులు రమేష్ బాలప్ప చిన్నప్ప నారాయణ నర్సప్ప వివిధ పార్టీల గ్రామ నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# మైనర్ బాలికతో అసభ్య ప్రవర్తన.. వృద్ధుడిపై పోక్సో కేసు

**మల్కాజ్‌గిరి, జూన్ 3:( సమయం న్యూస్). :** కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఆరోపణలపై ముడికొండ లింగం (75) అనే వృద్ధుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ భాస్కర్ రెడ్డి తెలిపారు.

పోలీసుల వివరాల ప్రకారం.. 14 ఏళ్ల బాలిక కిరాణా దుకాణానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా, సమీపంలోని ఇస్త్రీ షాప్‌లో పనిచేసే వ్యక్తి ఆమెను లోపలికి పిలిచి షట్టర్ మూసి అసభ్యంగా ప్రవర్తించినట్లు బాలిక కుటుంబ సభ్యులకు తెలిపింది. గతంలో కూడా ఇలాంటి ప్రవర్తనకు పాల్పడినట్లు బాలిక వెల్లడించినట్లు సమాచారం.బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు.

- హైదరాబాద్ సిపి సజ్జనార్
- రోడ్డు భద్రతపై సమీక్ష సమావేశంలో అధికారులకు దిశానిర్దేశించిన పోలీస్ కమిషనర్.




**హైదరాబాద్ జూన్3( సమయ్దం న్యూస్). :** హైదరాబాద్ నగరంలో రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ), బంజారాహిల్స్‌లో బుధవారం ఉన్నతస్థాయి రోడ్డు భద్రత సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) జోయెల్ డేవిస్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా పాల్గొన్నారు.సమావేశంలో నగరంలోని రోడ్లు, జాతీయ రహదారుల వారీగా ప్రమాదాల గణాంకాలు, ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లు, బ్లైండ్ స్పాట్లు, పాదచారుల ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, హిట్ అండ్ రన్ ఘటనలు, బాధితులకు అందిస్తున్న పరిహారం తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించారు. గత ప్రమాదాల ఆధారంగా ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి చేపట్టాల్సిన చర్యలపై పూర్తిస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ పోలీస్ వి.సి. సజ్జనార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత విషయంలో సంబంధిత శాఖలన్నీ జవాబుదారీతనం, బాధ్యతతో పనిచేయాలని సూచించారు. సమీక్ష సమావేశాలు కేవలం చర్చలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు, ఫలితాలుగా మారాలని అన్నారు. నగరంలో తగిన రోడ్డు సూచికలు, రహదారి గుర్తులు, జీబ్రా క్రాసింగ్‌లు, ఫుట్‌పాత్‌ల ఏర్పాటుతో పాటు ఆక్రమణల తొలగింపు చేపట్టాలని సూచించారు. అక్రమ రహదారి దాటివేతలను నిరోధించేందుకు సెంట్రల్ మీడియన్లు, డివైడర్ల ఎత్తు పెంచి గార్డ్ రైలింగ్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాదాల చరిత్ర ఆధారంగా గుర్తించిన ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా వీధి దీపాల ఏర్పాటు, స్పీడ్ కంట్రోల్ చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థల మెరుగుదల, శాస్త్రీయంగా యూ-టర్న్‌లు, ఫ్రీ లెఫ్ట్‌ల రూపకల్పన, ట్రాఫిక్ రద్దీ తగ్గింపు, లేన్ క్రమశిక్షణ అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) జోయెల్ డేవిస్ నగరంలోని ప్రధాన బ్లాక్ స్పాట్లు, బ్లైండ్ స్పాట్లు మరియు ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలపై వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జల నిర్మాణం, బస్ షెల్టర్ల తొలగింపు లేదా స్థాన మార్పు, బస్ బేల నియంత్రణ తదితర చర్యలను ప్రతిపాదించారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, మరణాలను నివారించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. సంబంధిత శాఖలకు అప్పగించిన పనులపై నిర్దిష్ట గడువులోగా యాక్షన్ టేకెన్ రిపోర్టులు సమర్పించాలని ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో కార్యాచరణను వేగవంతం చేయాలని సూచించారు.తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) డ్రైవర్లకు రోడ్డు భద్రతా నిబంధనలు, ప్రవర్తనా నైపుణ్యాలపై సమగ్ర శిక్షణ అందించాలని సమావేశంలో సూచించారు. ఆర్టీసీ బస్సులతో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.రోడ్డు భద్రతకు సంబంధించిన కార్యక్రమాల అమలులో వివిధ శాఖల మధ్య సమన్వయం, పర్యవేక్షణ, అనుసంధానం కోసం ప్రత్యేక ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై కూడా సమావేశంలో చర్చించారు.ఈ సమావేశంలో ఆర్టీఏ సభ్యుడు నేతికార్ సురేష్ లాల్, అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, టీజీఎస్‌ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుధా పరిమళ, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ), రోడ్లు భవనాల శాఖ, రవాణా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, స్వచ్ఛంద సంస్థలు మరియు ఇతర భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించి ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

**- విద్యాశాఖ కార్యదర్శి యోగిత రానా ఐఏఎస్**






**నారాయణపేట, జూన్,03(సమయం న్యూస్) :** ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు పెంపు, విద్యా నాణ్యత మెరుగుదల, సాంకేతిక విద్యాభివృద్ధి, ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం సమర్థవంతమైన అమలు తదితర అంశాలపై రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగిత రానా, ఐఏఎస్ అధ్యక్షతన బుధవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఐఏఎస్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు (ణఱతీవవ్‌శీతీ శీట రాఎష్ట్రశీశీశ్రీ జుఃబఎష్‌ఱశీఅ) నవీన్ నికోలస్, ఐఏఎస్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు (డీఈఓలు), జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు (డీఐఈఓలు) ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

నారాయణపేట జిల్లా తరఫున మక్తల్ తహసీల్దార్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక, ఐఏఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఆమెతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఎం. గోవిందరాజులు, ఏఎంఓ విద్యాసాగర్, సీఎంఓ రాజేంద్ర కుమార్, ఎస్ఓ నాగార్జున రెడ్డి మరియు ఇతర సంబంధిత అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి చేపట్టనున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని గ్రామాలు, వార్డులు, తండాలు, గూడెల స్థాయి వరకు విస్తృతంగా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు), తెలంగాణ మోడల్ స్కూళ్లలో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.అదేవిధంగా జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ మరియు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు.

జిల్లాల్లో ఉన్న జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలలను పునఃప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రతి చిన్నారిని విద్యా ప్రవాహంలోకి తీసుకురావాలని సూచించారు. అలాగే కొత్త ప్రీ-ప్రైమరీ విభాగాల ఏర్పాటును వేగవంతం చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల నమోదు పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా విద్యార్థుల నమోదు పెంపు, భవిత కేంద్రాల బలోపేతం, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల అభివృద్ధి, డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమాల అమలు, పాఠ్యపుస్తకాలు మరియు యూనిఫారాల పంపిణీ వంటి కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని, నూతనంగా మంజూరైన ప్రీ-ప్రైమరీ విభాగాలను జూన్ 12 నాటికి ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలల పునరుద్ధరణ, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, జిల్లా స్థాయి పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.విద్యార్థుల భవిష్యత్ నైపుణ్యాభివృద్ధికి తోడ్పడే భవిత కేంద్రాలను బలోపేతం చేయాలని, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచేందుకు ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాల్లా, AXL, AI-Pi-Jam వంటి డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీ నవీన్ నికోలస్, ఐఏఎస్ మాట్లాడుతూ, 2025-26 విద్యా సంవత్సరంలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఖీూచీ) కార్యక్రమం అమలులో నారాయణపేట జిల్లా సాధించిన ప్రగతిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లో ప్రాథమిక చదవడం, రాయడం, గణిత నైపుణ్యాల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు సమిష్టిగా చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో 2026-27 విద్యా సంవత్సరంలో కూడా ఖీూచీ లక్ష్యాల సాధనకు మరింత కృషి చేసి విద్యార్థుల అభ్యాస స్థాయిలను మెరుగుపరచాలని సూచించారు.అదేవిధంగా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పూర్తిస్థాయి-లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సెర్ప్ బృందాల ద్వారా యూనిఫారాల కుట్టింపు మరియు పంపిణీ కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాస్థాయిలో ప్రతిరోజూ సమీక్షలు నిర్వహిస్తూ బడిబాట కార్యక్రమం పురోగతిని పర్యవేక్షించాలని, నమోదు లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు పెంపునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# విదేశీయుల వివరాల సమర్పణ తప్పనిసరి

- గోల్కొండ డీసీపీ హెచ్చరిక

**హైదరాబాద్, జూన్ 3:( సమయం న్యూస్) :** విదేశీయుల బస, ప్రవేశం, నిష్క్రమణకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో సమర్పించాలని గోల్కొండ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సూచించారు. 2025 ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టం, నిబంధనల ప్రకారం గృహ యజమానులు, హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు, హోమ్ స్టేలు, విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఆసుపత్రులు తదితర వసతి కల్పించే సంస్థలు విదేశీయుల వివరాలను నిర్దిష్ట నమూనాల్లో సమర్పించడం తప్పనిసరి అని తెలిపారు.

ఫారం-××× (ఫారం-సీ): విదేశీ పాస్‌పోర్టు కలిగిన వారు, ఓసీఐ కార్డు దారులు, నేపాల్ పౌరులు సహా తమ వద్ద బస చేసే ప్రతి విదేశీయుడి వివరాలను వసతి కల్పించే సంస్థలు లేదా వ్యక్తులు వారి రాక నుంచి 24 గంటల్లోపు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా సమర్పించాలి. అలాగే విదేశీయుడు వెళ్లిపోయిన సమాచారాన్ని కూడా నమోదు చేసి, ఆ రికార్డులను కనీసం ఒక సంవత్సరం పాటు భద్రపరచాలి.

ఫారం-××: విదేశీ విద్యార్థులకు ప్రవేశం కల్పించే విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, శిక్షణా సంస్థలు విద్యార్థుల ప్రవేశం, నమోదు, రాక, నిష్క్రమణ, చదువు నిలిపివేత తదితర వివరాలను ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు:** ఫారం-××× లేదా ఫారం-×× సమర్పించకపోవడం, తప్పుడు సమాచారం ఇవ్వడం, వాస్తవాలను దాచిపెట్టడం లేదా చట్టబద్ధ నిబంధనలను పాటించకపోవడం చట్ట ఉల్లంఘనగా పరిగణించబడుతుందని డీసీపీ తెలిపారు. ఇలాంటి సందర్భాల్లో 2025 ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టంలోని సెక్షన్-23 సహా సంబంధిత నిబంధనల ప్రకారం శిక్షార్హ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అందరూ చట్ట నిబంధనలను కచ్చితంగా పాటించి, న్యాయపరమైన ఇబ్బందులను నివారించుకోవాలని గోల్కొండ జోన్ డీసీపీ సూచించారు.

# ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ విఫలం: కేటీఆర్



**హైదరాబాద్, జూన్ 3:( సమయం న్యూస్)** రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 60 రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కనీసం సంచులు కూడా అందుబాటులో లేవని ఆరోపించారు. రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను నిర్లక్ష్యం చేస్తోందన్నారు.

**మోడీ--రేవంత్ జోడీ ప్రభుత్వం**

తెలంగాణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని, రైతు డిస్కమ్ పేరుతో వ్యవసాయ విద్యుత్‌పై మీటర్ల విధానాన్ని అమలు చేసే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తాం**

ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతోందని ఆరోపించిన కేటీఆర్, బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేస్తామని ప్రకటించారు.

**జర్నలిస్టులను మోసం చేస్తున్న ప్రభుత్వం**

జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ప్లాట్లు ఇస్తామంటూ ప్రభుత్వం మోసం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. జర్నలిస్టులకు నిజంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే ఉద్దేశం ఉంటే ఇప్పటికే గుర్తించిన ప్రాంతాల్లోనే భూములు కేటాయించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడితే జర్నలిస్టుల కమిటీ సూచనల మేరకు ఇళ్ల స్థలాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.

**విజయాలు--ఓటములు సహజం**

రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికే కట్టుబడి పనిచేస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కృషి

**● కలెక్టర్ ప్రియాంక అలా**

**హైదరాబాద్, జూన్ 3( సమయం న్యూస్).** ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (పీసీఆర్), ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ (పీఓఏ) చట్టాల కింద నమోదైన కేసుల త్వరిత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కేసుల పురోగతి, శిక్షల శాతం, బాధితులు మరియు కమిటీ సభ్యులు లేవనెత్తిన అంశాలపై సమీక్షించారు. అట్రాసిటీ కేసులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన జారీ చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. సమావేశంలో అదనపు సీపీ శ్రీనివాస్, ఎస్సీ అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్, గిరిజన సంక్షేమ అధికారి కోటజి, కమిటీ సభ్యులు, ఆర్డీవోలు, ఏసీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి



**సిద్దిపేట, జూన్ 3( సమయం న్యూస్). :** 99 డేస్ ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం, ప్రసంగ పోటీలు నిర్వహించి విజేతలకు స్టీల్ వాటర్ బాటిళ్లు, పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. పర్యావరణ శాస్త్రవేత్త టి. రవీందర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ హిత వస్తువులను ఉపయోగించాలని సూచించారు.



DBCDO గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన పి. నర్సయ్య జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్క అందించారు.



విద్యా శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మల్లిఖార్జున్ బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందించిన దృశ్యం.

# మోత్కుపల్లి గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయిలో 3 ర్యాంక్




**అవార్డు ను అందుకున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి,సర్పంచ్ బైండ్ల అమృతమ్మ**

**వికారాబాద్: కోట్ పల్లి మండలం, జూన్,03(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కోట్ పల్లి మండలం మోత్కు పల్లి గ్రామ పంచాయతీ కి జాతీయ స్థాయి లో 3 ర్యాంక్ రావడం జరిగింది. బుధవారం న్యు డిల్లి లో కేంద్ర పంచాయతి రాజ్, మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ( లాలన్ సింగ్) ,కేంద్ర సహాయ మంత్రి ఎస్ పి సింగ్ బఘెల్ గార్లు అవార్డును ప్రదానం చేశారు. వికారాబాద్ జిల్లా నుండి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి , మోత్కు పల్లి గ్రామ సర్పంచ్. బైండ్ల అమృతమ్మ లు అవార్డు ను స్వీకరించారు.

# మేఘాలు కమ్ముకుంటున్నా.... ధాన్యం మాత్రం కదలడం లేదు!

## లారీల కోసం ఎదురుచూస్తూ రోడ్డెక్కిన రైతన్నలు.



**రాయపోల్, జూన్ 3:** ఒకవైపు వర్షాకాలం ముంచుకొస్తోంది.. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఎప్పుడు వర్షం కురుస్తుందోనన్న ఆందోళనలో ఉన్న రైతులు, ధాన్యం తరలింపునకు లారీలు అందుబాటులో లేకపోవడంతో బుదవారం రోడ్డెక్కారు. రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి గ్రామ రైతులు గజ్వేల్--చేగుంట ప్రధాన రహదారిపై వీరనగర్ స్టేజి వద్ద ధర్నా నిర్వహించి అధికారుల దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. కష్టానికి ప్రతిఫలంగా పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు చేర్చినా, రోజుల తరబడి అక్కడే నిల్వ ఉండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. "ఆకాశంలో మేఘాలు కనిపిస్తున్నాయి.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కనిపిస్తోంది.. కానీ లారీలు మాత్రం కనిపించడం లేదు" అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడితే ధాన్యం తడిసి నాణ్యత కోల్పోయే ప్రమాదం ఉందని, అప్పటికే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు ఇది మరో దెబ్బగా మారుతుందని పేర్కొన్నారు. వెంటనే లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో కొంతసేపు ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు,అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు.

"పంట పండించడం వరకు రైతు బాధ్యత... కొనుగోలు చేసిన ధాన్యాన్ని భద్రంగా తరలించడం ప్రభుత్వ బాధ్యత" అని రైతులు స్పష్టం చేశారు.

# వనమహోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

## : యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్





**మల్కాజ్‌గిరి, జూన్ 3 (సమయం న్యూస్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజ్‌గిరి సర్కిల్ పరిధిలో చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్ కోరారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 90 రోజుల పూర్తి సందర్భంగా బుధవారం మౌలాలిలోని ఏపీఐఐసీ కాలనీ పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వర్షాకాలం మొక్కల పెంపకానికి అనుకూల సమయమని, పార్కులు, రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. మల్కాజ్‌గిరి సర్కిల్ పరిధిలో మొక్కల నాటకానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ సందీప్, శానిటరీ సూపర్వైజర్లు శ్రీనివాస్, వెంకటేష్, రవీందర్, రాజు, యూబీడీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ఏపీఐఐసీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరి జోనల్ కార్యాలయంపై విజిలెన్స్ ఆరా

**మల్కాజ్ గిరి జూన్3( సమయం న్యూస్). :** మల్కాజ్‌గిరి జోనల్ కార్యాలయంపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. ఇటీవల కార్యాలయంలో చోటుచేసుకుంటున్న పలు పరిణామాల నేపథ్యంలో బుధవారం ఉదయం అధికారులు కార్యాలయాన్ని సందర్శించి, టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన వివరాలను సేకరించినట్లు తెలిసింది. టౌన్ ప్లానింగ్ ఏసీపీ వి.బి. శ్రీనివాస్‌ను కలిసి నిర్మాణ అనుమతులు, సంబంధిత ఫైళ్లపై ఆరా తీసినట్లు సమాచారం. కార్యాలయ పరిధిలో కొనసాగుతున్న పలు నిర్మాణాల అనుమతులు, నిబంధనల అమలు, రికార్డులను పరిశీలించినట్లు తెలిసింది. ఈ విషయంపై మల్కాజ్‌గిరి ఏసీపీ వి. బాలకృష్ణను సంప్రదించగా, నిర్మాణ అనుమతులకు సంబంధించిన వివరాలనే అధికారులు అడిగి తెలుసుకున్నారని వెల్లడించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



**కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్, జూన్ 3:( సమయం న్యూస్). :** కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులకు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఓటర్ల వివరాల మ్యాపింగ్ ప్రక్రియ అత్యంత కీలకమని తెలిపారు. 2002 నాటి ఓటర్ల జాబితాలోని వివరాలతో ప్రస్తుత వివరాలను సరిపోల్చుకోవాలని సూచించారు. పాత జాబితా అందుబాటులో లేకపోతే ఎన్నికల సంఘం, సీఈఓ తెలంగాణ వెబ్‌సైట్లలో వివరాలు పరిశీలించవచ్చన్నారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని, జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని, సెప్టెంబర్ 28లోపు వాటి పరిష్కారం అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని వెల్లడించారు.

రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించి సర్వే ప్రక్రియకు సహకరించాలని కలెక్టర్ కోరారు.



జిల్లా రవాణా అధికారిగా బి.కిషోర్ బాబు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆఫ్ఘాన్ టెస్టుకు సిరాజ్ ఆడటంపై సందిగ్ధత



**చండీగఢ్, జూన్ 3 :** టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు అందుబాటులో ఉండటంపై అనిశ్చితి నెలకొంది. ఇటీవల ముగిసిన ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో వరుసగా మ్యాచ్‌లు ఆడిన నేపథ్యంలో అతనిపై పనిభారం పెరగడంతో విశ్రాంతి ఇవ్వాలా అనే అంశాన్ని భారత జట్టు యాజమాన్యం పరిశీలిస్తోంది. ఈ విషయంపై వచ్చే రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. జూన్ 6 నుంచి చండీగఢ్‌లోని న్యూ పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ మైదానంలో భారత్, ఆఫ్ఘనిస్థాన్ జట్ల మధ్య ఏకైక టెస్టు ప్రారంభం కానుంది. గుజరాత్ టైటాన్స్ తరఫున ఐపీఎల్ మొత్తం సీజన్ ఆడిన సిరాజ్ ఫైనల్ వరకు జట్టుతో కొనసాగాడు. దీంతో అతనికి విశ్రాంతి అవసరమని వైద్య బృందం, జట్టు నిర్వహణ భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం సిరాజ్ జట్టుతో కలిసి చండీగఢ్‌లోనే ఉండి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉన్నాడు. ఒకవేళ సిరాజ్‌కు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయిస్తే, జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ పేసర్ అకీబ్ నబీకి జట్టులో అవకాశం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అకీబ్ నబీ 2025-26 రంజీ సీజన్‌లో 60 వికెట్లు పడగొట్టి తన జట్టును ఛాంపియన్‌గా నిలపడంలో కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం నెట్ బౌలర్‌గా భారత జట్టుతో ఉన్న అతడిని ప్రధాన జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. అదే సమయంలో యువ పేసర్ గుర్నూర్ బ్రార్ టెస్టు అరంగేట్రం చేసే సూచనలు కూడా బలంగా కనిపిస్తున్నాయి. ఆఫ్ఘనిస్థాన్‌పై పూర్తిగా అనుభవంలేని బౌలింగ్ దళంతో బరిలోకి దిగడం సెలక్టర్లకు ఇష్టం లేకపోయినా, సిరాజ్ గైర్హాజరీలో యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ మ్యాచ్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగం కాకపోయినా, భవిష్యత్ సిరీస్‌లకు జట్టును సిద్ధం చేసే దిశగా కీలకంగా మారింది. అనంతరం ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ కూడా జరగనుంది. ఆటగాళ్ల ఫిట్‌నెస్, పనిభార నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి సిరాజ్ విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. అతడు ఆడతాడా లేదా అనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది.



## భారత్-న్యూజిలాండ్ మధ్య
# చరిత్రాత్మక క్రికెట్ సిరీస్

**ఆక్లాండ్, జూన్ 3 :** భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య చరిత్రలోనే అతిపెద్ద ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌కు రంగం సిద్ధమైంది. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 1 వరకు దాదాపు 40 రోజుల పాటు కొనసాగే ఈ పర్యటనలో మొత్తం 12 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో ఐదు ఇరవై ఓవర్ల మ్యాచ్‌లు, ఐదు ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్‌లు, రెండు టెస్టు మ్యాచ్‌లు ఉన్నాయి. రెండు దేశాల మధ్య క్రీడా సంబంధాలకు వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ప్రత్యేక సిరీస్‌ను నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఇంత పెద్ద స్థాయిలో ద్వైపాక్షిక సిరీస్ ఎప్పుడూ జరగలేదు. అక్టోబర్ 22న క్రైస్ట్‌చర్చ్‌లో తొలి ఇరవై ఓవర్ల మ్యాచ్‌తో సిరీస్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఐదు ఇరవై ఓవర్ల మ్యాచ్‌లు పూర్తయ్యాక ఒకరోజు అంతర్జాతీయ సిరీస్ ప్రారంభమవుతుంది. నవంబర్ 4న ఆక్లాండ్‌లో తొలి ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్ జరగనుంది. టెస్టు సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్టన్‌లో జరుగుతుంది. రెండో టెస్టు నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు క్రైస్ట్‌చర్చ్‌లో నిర్వహించనున్నారు. న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ప్రధాన మార్కెటింగ్ అధికారి గ్లెన్ క్రిట్‌చెల్లీ మాట్లాడుతూ, ఇది కేవలం క్రికెట్ సిరీస్ మాత్రమే కాదని, రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ప్రతిబింబించే వేడుకగా కూడా నిలుస్తుందని తెలిపారు. భారత్ స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా వంటి ప్రముఖ ఆటగాళ్లు కూడా ఈ పర్యటనలో పాల్గొనే అవకాశం ఉందని, వారి రాకకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. 2019-20 సీజన్ తర్వాత భారత్ న్యూజిలాండ్‌లో పర్యటించలేదు. అయితే ఆ తర్వాత రెండు సార్లు న్యూజిలాండ్ జట్టు భారత్‌లో పర్యటించింది. ఈ నేపథ్యంలో రానున్న ఈ భారీ సిరీస్‌పై ఇరు దేశాల క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# ఐపీఎల్-2027కు కమిన్స్ దూరమా?

## ఎస్ఆర్‌హెచ్‌లో చర్చనీయాంశం



**హైదరాబాద్, జూన్ 3 :** సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులను ఆందోళనకు గురిచేసే వార్త ఒకటి క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆస్ట్రేలియా స్టార్ పేసర్, ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఐపీఎల్-2027 సీజన్‌కు దూరంగా ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. వచ్చే ఏడాది ఆస్ట్రేలియా జట్టుకు అత్యంత కీలకమైన అంతర్జాతీయ షెడ్యూల్ ఉండనుంది. యాషెస్ సిరీస్, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్, వన్డే ప్రపంచకప్ వంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలు వరుసగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో జట్టుకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో కమిన్స్ ఐపీఎల్‌కు విరామం ఇవ్వాలని భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నిరంతర క్రికెట్ కారణంగా శారీరక అలసట, గాయాల ప్రమాదం పెరుగుతుందని భావిస్తున్న కమిన్స్, జాతీయ జట్టు బాధ్యతలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. గతంలో కూడా పలువురు ఆస్ట్రేలియా ఆటగాళ్లు అంతర్జాతీయ టోర్నీల దృష్ట్యా ఐపీఎల్‌కు దూరమైన సందర్భాలు ఉన్నాయి. ఒకవేళ కమిన్స్ నిజంగానే ఐపీఎల్-2027లో ఆడకపోతే సన్‌రైజర్స్ హైదరాబాద్ కొత్త కెప్టెన్ ఎంపికపై దృష్టి సారించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న ఇషాన్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించే అవకాశముందని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే కమిన్స్ భవిష్యత్తు, ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్సీపై ప్రస్తుతం అధికారిక స్పష్టత లేదు. ఫ్రాంచైజీ లేదా ఆటగాడి నుంచి ప్రకటన వెలువడే వరకు ఈ వార్తలను ఊహాగానాలుగానే పరిగణించాల్సి ఉంటుంది. ఎస్ఆర్‌హెచ్ అభిమానులు మాత్రం కమిన్స్ జట్టుతోనే కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# రోహిత్, హార్దిక్‌కు బీసీసీఐ పిలుపు

**న్యూఢిల్లీ, జూన్ 3 :** ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ముందు భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. టీమిండియా సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా వెంటనే బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ శిబిరానికి హాజరుకావాలని బోర్డు ఆదేశించింది. రాబోయే సిరీస్‌కు ముందు ఆటగాళ్ల శారీరక దృఢత్వం, మ్యాచ్ సన్నద్ధతను పూర్తిస్థాయిలో అంచనా వేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల ముగిసిన ఐపీఎల్ సీజన్ అనంతరం రోహిత్ శర్మ విశ్రాంతితో పాటు ఫిట్‌నెస్‌పై దృష్టి సారించగా, హార్దిక్ పాండ్యా గాయం నుంచి కోలుకుంటున్న పరిస్థితిలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఇద్దరికీ జాతీయ క్రికెట్ అకాడమీలో ప్రత్యేక ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టి వారి శారీరక సామర్థ్యాన్ని పరిశీలించనున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌కు ముందు కీలక ఆటగాళ్లు అత్యుత్తమ ఫామ్‌లో ఉండేలా చూడటంతో పాటు జట్టు సమతుల్యతను మెరుగుపరచడమే బోర్డు లక్ష్యంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ క్రికెట్‌లో ముందున్న రద్దీ షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకుని ఆటగాళ్ల పనిభార నిర్వహణ, ఫిట్‌నెస్ ప్రమాణాల విషయంలో రాజీపడకూడదని బీసీసీఐ భావిస్తోంది. ఈ క్రమంలోనే రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యాలకు ప్రత్యేక శిబిరంలో పాల్గొనాలని స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు తెలుస్తోంది.



# ప్రజ్ఞానందకు మరో ఘన విజయం

**ఓస్లో, జూన్ 3 :** భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మరోసారి ప్రపంచ చెస్ వేదికపై తన సత్తా చాటాడు. నార్వే చెస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడు మ్యాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించి సంచలనం సృష్టించాడు. క్లాసికల్ విభాగంలో కార్ల్‌సన్‌పై సాధించిన ఈ విజయం ప్రజ్ఞానందకు ఈ ఏడాదిలో రెండో గెలుపు కావడం విశేషం. డబుల్ రౌండ్ రాబిన్ విధానంలో జరుగుతున్న ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో ప్రజ్ఞానంద అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఇప్పటివరకు 12 పాయింట్లు సాధించిన అతడు పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ ఏడాది క్లాసికల్ చెస్‌లో కార్ల్‌సన్‌పై రెండుసార్లు విజయం సాధించిన తొలి ఆటగాడిగా ప్రజ్ఞానంద అరుదైన ఘనత అందుకున్నాడు. మరోవైపు ప్రపంచ చాంపియన్ డీ గుకేశ్‌కు నిరాశ ఎదురైంది. ఎనిమిదో రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన గ్రాండ్‌మాస్టర్ అలిరేజా ఫిరౌజా చేతిలో ఓటమి పాలయ్యాడు. దీంతో గుకేశ్ పాయింట్ల పట్టికలో దిగువ స్థానాల్లోనే కొనసాగుతున్నాడు. ప్రస్తుతం అలిరేజా ఫిరౌజా 13 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా, అమెరికాకు చెందిన గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో 14 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. టోర్నీలో ఇంకా రెండు రౌండ్లు మిగిలి ఉండటంతో పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారింది. ఇక అయిదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన మ్యాగ్నస్ కార్ల్‌సన్ ఈ టోర్నీలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. ఇప్పటివరకు కేవలం 9 పాయింట్లు మాత్రమే సాధించిన అతడు వెనుకబడ్డాడు. మిగిలిన రెండు క్లాసికల్ గేమ్‌ల్లో గెలిచినా అగ్రస్థానానికి చేరుకోవడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. కార్ల్‌సన్‌పై ప్రజ్ఞానంద సాధించిన విజయాల సంఖ్య ఇప్పుడు మూడుకు చేరుకుంది. భారత యువ చెస్ సంచలనం మరోసారి ప్రపంచ దృష్టిని తనవైపు తిప్పుకోవడంతో దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రపంచకప్‌లో భారతీయ మూలాల
# ముగ్గురు ఆటగాళ్ల సందడి




**న్యూఢిల్లీ, జూన్ 3 :** ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్--2026కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల సంయుక్త ఆతిథ్యంలో జూన్ 11 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. భారత జాతీయ జట్టు ఈ ప్రపంచకప్‌కు అర్హత సాధించకపోయినా, భారతీయ మూలాలున్న ముగ్గురు యువ ఫుట్‌బాలర్లు వేర్వేరు దేశాల తరఫున బరిలోకి దిగనుండటం భారత అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఖతార్ జట్టుకు ఎంపికైన తహ్సాన్ మహ్మద్ జంషీద్ ఈ జాబితాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కేరళలోని కన్నూర్ జిల్లాకు చెందిన మలయాళీ కుటుంబ మూలాలు కలిగిన తహ్సాన్ ప్రస్తుతం ఖతార్ లీగ్‌లో అద్భుత ప్రదర్శనతో గుర్తింపు పొందాడు. కేవలం 19 ఏళ్ల వయసులోనే ప్రపంచకప్ తుది జట్టులో స్థానం సంపాదించడం ద్వారా అతడు అరుదైన ఘనతను అందుకున్నాడు. న్యూజిలాండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న సర్‌ప్రీత్ సింగ్ కూడా భారతీయ మూలాలున్న ప్రముఖ ఆటగాడు. పంజాబీ కుటుంబానికి చెందిన ఆయన, న్యూజిలాండ్ తరఫున కీలక మిడ్‌ఫీల్డర్‌గా రాణిస్తున్నాడు. గతంలో యూరప్‌లోని ప్రముఖ క్లబ్‌ల తరఫున ఆడిన అనుభవం కలిగిన సర్‌ప్రీత్, న్యూజిలాండ్ ప్రపంచకప్ అర్హత సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆస్ట్రేలియా జట్టులో చోటు దక్కించుకున్న నిషాన్ వేలుపిళ్లై మరో భారతీయ మూలాల ఆటగాడు. తమిళ కుటుంబ నేపథ్యం కలిగిన నిషాన్, వేగవంతమైన వింగర్‌గా గుర్తింపు పొందాడు. ప్రపంచకప్‌లో ఆడనున్న తొలి తమిళ సంతతి ఫుట్‌బాలర్‌గా ఆయన చరిత్ర సృష్టించనున్నాడు. ఇక భారతీయ మూలాలున్న మరో ఆటగాడు నైలు ఆద్య మేసన్ తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. ఫిట్‌నెస్ సమస్యలు, జట్టు సమీకరణాల కారణంగా అతని పేరు చివరి క్షణంలో జాబితా నుంచి తప్పించబడింది. భారత జట్టు ఈ టోర్నీలో లేకపోయినా, భారతీయ మూలాలున్న ఈ ముగ్గురు ఆటగాళ్ల ప్రదర్శన ప్రపంచకప్ సందర్భంగా భారత అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. వారి విజయాలు ప్రపంచ ఫుట్‌బాల్ వేదికపై భారతీయ వారసత్వానికి మరింత గుర్తింపు తీసుకురావాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# క్యాన్సర్‌ను జయించిన హంసా నందిని



సినీ ఇండస్ట్రీలో హీరోయిన్‌గా రాణించాలని ఎంతో మంది కలలు కంటూ అడుగుపెడతారు. అయితే కొందరికి మాత్రమే స్టార్‌డమ్ దక్కుతుంది. మరికొందరు అవకాశాల కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటారు. అలాంటి నటీమణుల్లో ఒకరు హంసా నందిని. పూణెలో జన్మించి పెరిగిన హంసా నందిని మోడలింగ్‌పై ఆసక్తితో ముంబైకి వెళ్లారు. 2002 నుంచి మోడలింగ్ రంగంలో కొనసాగుతూ పలు టెలివిజన్ ప్రకటనల్లో నటించారు. అనంతరం 2004లో విడుదలైన లిఒకటవుదాంలి చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. హీరోయిన్‌గా పలు చిత్రాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయారు. దీంతో కొన్ని సినిమాల్లో రెండో కథానాయికగా నటించారు. అయినప్పటికీ పెద్దగా గుర్తింపు రాకపోవడంతో ప్రత్యేక గీతాల ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 2013లో విడుదలైన మిర్చి, భాయ్, అత్తారింటికి దారేది, రామయ్యా వస్తావయ్యా, అలాగే లెజెండ్ చిత్రాల్లో చేసిన స్పెషల్ సాంగ్స్‌తో హంసా నందిని మంచి గుర్తింపు సంపాదించారు. అయితే కెరీర్ మంచి దశలో ఉండగానే 2021లో ఆమెకు రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు వెల్లడించారు. తన తల్లి కూడా క్యాన్సర్ కారణంగానే మరణించారని, జన్యుపరమైన కారణాల వల్ల తాను కూడా ఈ వ్యాధి బారిన పడ్డానని అప్పట్లో తెలిపారు. తీవ్ర మనోధైర్యంతో చికిత్స తీసుకుని క్యాన్సర్‌ను జయించిన హంసా నందిని ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. ప్రస్తుతం హంసా నందిని సోషల్ మీడియాలో చురుకుగా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. ఫొటోషూట్లు, వ్యక్తిగత విషయాలను పంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అలాగే మంచి పాత్రల కోసం ఎదురుచూస్తూ మళ్లీ సినీ రంగంలో బిజీ కావాలని ప్రయత్నిస్తున్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధిని జయించి జీవితంలో ముందుకు సాగుతున్న హంసా నందిని ప్రయాణం అనేక మందికి ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందించే ఉదాహరణగా నిలుస్తోంది.

# అమెరికాలో పెద్ది దూకుడు




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, జాన్వీ కపూర్ కథానాయికగా నటించిన భారీ క్రీడా నేపథ్య యాక్షన్ చిత్రం 'పెద్ది' విడుదలకు ముందే రికార్డుల వేట మొదలుపెట్టింది. దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కించిన ఈ ప్రతిష్టాత్మక చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో విదేశీ మార్కెట్‌లోనూ సినిమా సెన్సేషన్ సృష్టిస్తోంది. తాజా వాణిజ్య వర్గాల సమాచారం ప్రకారం, అమెరికాలో ప్రీమియర్ ప్రదర్శనల ముందస్తు టికెట్ విక్రయాల ద్వారానే 'పెద్ది' చిత్రం 10 లక్షల డాలర్లకు పైగా వసూళ్లు సాధించింది. విడుదలకు ముందే ఈ స్థాయి వసూళ్లు నమోదు కావడం చిత్రంపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తిని స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత రామ్ చరణ్ నటించిన చిత్రాల్లో అమెరికా మార్కెట్‌లో అత్యంత వేగంగా ముందస్తు వసూళ్లు సాధించిన చిత్రంగా 'పెద్ది' నిలిచినట్లు సినీ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అమెరికాలోని పలు ప్రధాన నగరాల్లో ప్రీమియర్ షోలకు టికెట్లు వేగంగా అమ్ముడవుతుండగా, తెలుగు ప్రేక్షకులతో పాటు ఇతర భాషల సినీ అభిమానులు కూడా ఈ చిత్రంపై ఆసక్తి చూపుతున్నారు. విడుదలకు ఇంకా కొంత సమయం ఉండగానే 10 లక్షల డాలర్ల మైలురాయిని దాటడం సినీ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సినిమా విడుదల సమయానికి 20 లక్షల డాలర్లకు పైగా ముందస్తు వసూళ్లు సాధించే అవకాశం ఉందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ నేపథ్యంతో రూపొందిన ఈ క్రీడా కథా చిత్రంలో రామ్ చరణ్ పూర్తిస్థాయి మాస్ పాత్రలో కనిపించనున్నారు. భావోద్వేగాలు, యాక్షన్, క్రీడా అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన ఈ చిత్రంలోని ప్రచార చిత్రాలు, పాటలు, ట్రైలర్ ఇప్పటికే ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందాయి. ఈ చిత్రంలో జగపతి బాబు, బోమన్ ఇరానీ, శివరాజ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. వృద్ధి సినిమాస్ నిర్మించిన 'పెద్ది' జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశీ మార్కెట్‌లోనూ టికెట్ బుకింగ్స్‌కు భారీ స్పందన లభిస్తుండటంతో, రామ్ చరణ్ సినీ ప్రస్థానంలోనే అత్యంత భారీ ఆరంభ వసూళ్లు నమోదు చేసే చిత్రంగా 'పెద్ది' నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అభిమానుల దృష్టి అంతా విడుదల రోజు బాక్సాఫీస్ ఫలితాలపైనే కేంద్రీకృతమైంది.



# తారక్‌తోనే బెస్ట్ కెమిస్ట్రీ..

## ఇలియానా వ్యాఖ్యలు వైరల్

ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన ఇలియానా డి క్రూజ్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తున్న ఆమె గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఎన్.టి. రామారావు జూనియర్ గురించి ఆమె చేసిన కామెంట్స్ నందమూరి అభిమానులను ఆనందంలో ముంచెత్తుతున్నాయి. తెలుగు సినీ పరిశ్రమలో మహేష్ బాబు, ప్రభాస్, రామ్, తారక్ వంటి అగ్ర హీరోలతో కలిసి నటించిన ఇలియానా, ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. "మీరు నటించిన హీరోల్లో ఎవరితో మీ స్క్రీన్ కెమిస్ట్రీ బాగా వర్కవుట్ అయింది?" అని యాంకర్ ప్రశ్నించగా, కాసేపు ఆలోచించిన ఇలియానా "తారక్‌తోనే నా స్క్రీన్ కెమిస్ట్రీ బెస్ట్" అని చెప్పడం విశేషం. ఇలియానా, తారక్ కాంబినేషన్‌లో వచ్చిన రాఖీ, శక్తి చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా 'రాఖీ' సినిమాలో వీరిద్దరి మధ్య సాగే ప్రేమకథ, పాటలు మంచి ఆదరణ పొందాయి. తారక్ ఎనర్జీకి తగ్గట్టుగా ఇలియానా చేసిన డ్యాన్స్ ప్రదర్శనలు కూడా అప్పట్లో విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే ఇలియానా కెరీర్‌లో పోకిరి, మున్నా, దేవదాసు వంటి భారీ విజయాలు ఉన్నప్పటికీ, నటన పరంగా మరియు స్క్రీన్‌పై అనుబంధం పరంగా తారక్‌తో ప్రత్యేకమైన కెమిస్ట్రీ ఉందని ఆమె అభిప్రాయపడినట్లు అభిమానులు భావిస్తున్నారు. ఇలియానా చేసిన ఈ వ్యాఖ్యలు పాతవే అయినప్పటికీ, ప్రస్తుతం తారక్ గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందుతున్న నేపథ్యంలో ఈ వీడియోను అభిమానులు పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. "తారక్‌తో ఇలియానా జోడీ ఎప్పటికీ ప్రత్యేకమే" అంటూ నందమూరి అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, వివాహం అనంతరం సినిమాలకు దూరంగా ఉన్న ఇలియానా ప్రస్తుతం తన ఇద్దరు కుమారులతో కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తూ సోషల్ మీడియాలో అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు.

# అబద్ధపు వేధింపుల కేసు పెట్టా

## నటి శిల్పా షిండే..



ప్రముఖ టెలివిజన్ నటి శిల్పా షిండే చేసిన తాజా వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దాదాపు పదేళ్ల క్రితం ఓ నిర్మాతపై తాను అబద్ధపు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశానని ఆమె స్వయంగా వెల్లడించడంతో సోషల్ మీడియా, టెలివిజన్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. 'భాభీజీ ఘర్ పర్ హైన్!' సీరియల్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన శిల్పా షిండే ఇటీవల ఓ పోడ్‌కాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన వివాదంపై స్పందిస్తూ, 2017లో నిర్మాత సంజయ్ కోహ్లీపై నమోదు చేసిన లైంగిక వేధింపుల ఫిర్యాదు నిజం కాదని అంగీకరించారు. ఆ సమయంలో కాంట్రాక్ట్‌కు సంబంధించిన వివాదాలు, పెండింగ్ చెల్లింపులు తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయని, గత్యంతరం లేక ఆ కేసు పెట్టాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. అనంతరం తనకు రావాల్సిన చెల్లింపులు అందిన తర్వాత ఇరు పక్షాలు కోర్టు వెలుపల రాజీ చేసుకుని కేసును ముగించుకున్నట్లు వెల్లడించారు. శిల్పా చేసిన ఈ వ్యాఖ్యలపై ఢిల్లీలోని పురుషుల హక్కుల కోసం పనిచేస్తున్న ఓ సంస్థ తీవ్రంగా స్పందించింది. తప్పుడు లైంగిక వేధింపుల కేసు పెట్టినట్లు స్వయంగా అంగీకరించిన నేపథ్యంలో ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అరెస్ట్ చేయాలని ముంబై పోలీసులను కోరింది. నిజమైన బాధితులకు రక్షణ కల్పించేందుకు రూపొందించిన చట్టాలను దుర్వినియోగం చేయడం ఆందోళనకరమని ఆ సంస్థ పేర్కొంది. ఇలాంటి ఘటనలు చట్టాల విశ్వసనీయతను దెబ్బతీసే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. ఇక శిల్పా వ్యాఖ్యలపై సినీ, టెలివిజన్ వర్గాల్లో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమెను తీవ్రంగా విమర్శిస్తుండగా, మరికొందరు నిజాన్ని బహిరంగంగా ఒప్పుకున్నందుకు ఆమె ధైర్యాన్ని అభినందిస్తున్నారు. ప్రస్తుతం శిల్పా షిండే, నిర్మాత సంజయ్ కోహ్లీ కుటుంబంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. అయితే ఆమె తాజా వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వ్యవహారం మళ్లీ చర్చకు రావడంతో, భవిష్యత్తులో దీనిపై మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.

# పండు మాస్టర్‌కు రోడ్డు ప్రమాదం



తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు సుపరిచితమైన ప్రముఖ నృత్య దర్శకుడు, నర్తకుడు పండు మాస్టర్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం సమీపంలో జరిగిన ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితిపై అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం ప్రకారం, తగరపువలసలో నిర్వహించిన అమ్మవారి ఉత్సవాల్లో ప్రత్యేక నృత్య ప్రదర్శనలో పాల్గొన్న పండు మాస్టర్, కార్యక్రమం ముగిసిన అనంతరం తన బృందంతో కలిసి తిరుగు ప్రయాణం ప్రారంభించారు. ప్రయాణ మధ్యలో బృందంలోని ఓ సభ్యుడు అస్వస్థతకు గురికావడంతో వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో పండు మాస్టర్ వాహనం నుంచి దిగి రోడ్డుపై నిలబడి పరిస్థితిని గమనిస్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ కోళ్ల రవాణా వాహనం అదుపుతప్పి ఆయనను ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అనంతరం ఆ వాహనం ఎదురుగా నిలిపి ఉన్న మరో కారును కూడా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పండు మాస్టర్‌ను స్థానికులు, ఆయన బృంద సభ్యులు వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, దెబ్బతిన్న ఇతర వాహనాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం లేదా ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. ప్రముఖ నృత్య కార్యక్రమాల ద్వారా గుర్తింపు పొందిన పండు మాస్టర్, తన ప్రత్యేక నృత్య శైలి, నృత్య దర్శకత్వంతో తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించుకున్నారు. టెలివిజన్ కార్యక్రమాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే సాంస్కృతిక వేడుకల్లోనూ ఆయన చురుకుగా పాల్గొంటున్నారు. ఇలాంటి సమయంలో ఆయనకు ప్రమాదం జరగడం అభిమానులను కలవరపెడుతోంది. పండు మాస్టర్ త్వరగా కోలుకోవాలని అభిమానులు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రార్థనలు చేస్తున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**




# బంగారం ధరలకు బ్రేక్

**హైదరాబాద్, జూన్ 3 :** గత కొద్దిరోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు నేడు స్వల్పంగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో పాటు దేశీయ డిమాండ్ పెరగడంతో బంగారం ధరల్లో రూ.10 చొప్పున పెరుగుదల నమోదైంది. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ధరలు మరోసారి షాక్ ఇచ్చాయి. గుడ్‌రిటర్న్ వివరాల ప్రకారం, ఉదయం 11 గంటల సమయంలో హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,56,220కు చేరుకుంది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,200గా నమోదైంది. 18 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,17,170గా ఉంది. మూడు రకాల బంగారం ధరలపై రూ.10 చొప్పున పెరుగుదల కనిపించింది. బంగారం బాటలోనే వెండి ధరలు కూడా స్వల్పంగా పెరిగాయి. 100 గ్రాముల వెండిపై రూ.10, కిలో వెండిపై రూ.100 పెరిగింది. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్‌లో 100 గ్రాముల వెండి ధర రూ.29,000గా ఉండగా, కిలో వెండి ధర రూ.2,90,000కు చేరుకుంది. అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు, డాలర్ మారకం విలువలు, భౌగోళిక ఉద్రిక్తతలు వంటి అంశాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరుగుతాయా లేదా స్థిరపడతాయా అన్న అంశంపై పెట్టుబడిదారులు, కొనుగోలుదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఏఐ ఉద్యోగాల జోరు

### ఐటీ రంగంలో కొత్త అవకాశాలు

**న్యూఢిల్లీ, జూన్ 3 :** ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నప్పటికీ, కృత్రిమ మేధస్సు ఆధారిత ఉద్యోగాలకు మాత్రం విపరీతమైన డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా "ఫార్వర్డ్–డిప్లాయ్డ్ ఇంజనీర్" అనే కొత్త తరహా ఉద్యోగ విభాగం ఐటీ రంగంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న అవకాశంగా మారింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఉద్యోగాలకు సంబంధించిన ప్రకటనలు 729 శాతం పెరగడం విశేషం. ఈ ఉద్యోగాల్లో ఎంపికైన వారికి ఏడాదికి సుమారు రూ.1.4 కోట్ల నుంచి రూ.1.6 కోట్లకు పైగా వేతనాలు లభిస్తున్నాయి. ప్రముఖ ఉద్యోగాల వేదిక విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2025 ఏప్రిల్‌లో 643గా ఉన్న ఈ ఉద్యోగాల సంఖ్య 2026 ఏప్రిల్ నాటికి 5,330కు చేరుకుంది. కృత్రిమ మేధస్సు రంగంలో ముందంజలో ఉన్న అనేక ప్రముఖ సంస్థలు ఈ ఉద్యోగాల కోసం పెద్ద ఎత్తున నియామకాలు చేపడుతున్నాయి. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా ఏఐ సాంకేతికతను అమలు చేయగల నిపుణుల కోసం కంపెనీలు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. ఒకవైపు సాంకేతిక రంగంలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది మాత్రమే లక్షకు పైగా ఉద్యోగులు వివిధ సంస్థల్లో ఉపాధి కోల్పోయినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. అనేక అంతర్జాతీయ సంస్థలు ఖర్చు తగ్గింపు చర్యల్లో భాగంగా ఉద్యోగుల సంఖ్యను కుదిస్తున్నాయి. గతంలో అధిక సంఖ్యలో నియామకాలు చేపట్టడం, మార్కెట్ మందగమనం, వ్యాపార లక్ష్యాలు నెరవేరకపోవడం వంటి కారణాలతో ఈ పరిస్థితి ఏర్పడింది. అయితే ఇదే సమయంలో కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలను వ్యాపారాల్లో అమలు చేయగల నిపుణుల అవసరం భారీగా పెరిగింది. దీంతో మిగిలిన రంగాల్లో ఉద్యోగాలు తగ్గుతున్నప్పటికీ, ఈ ప్రత్యేక విభాగంలో అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయి.

### ఫార్వర్డ్-డిప్లాయ్డ్ ఇంజనీర్ బాధ్యతలేమిటి?

ఫార్వర్డ్–డిప్లాయ్డ్ ఇంజనీర్‌లు కృత్రిమ మేధస్సు సాఫ్ట్‌వేర్ మరియు కస్టమర్ వ్యాపార అవసరాల మధ్య కీలక వారధిగా వ్యవహరిస్తారు. సంస్థలు రూపొందించిన ఏఐ సాధనాలను కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా మార్చడం, వారి వ్యాపార ప్రక్రియల్లో విజయవంతంగా అమలు చేయడం, తర్వాత అవి సమర్థవంతంగా పనిచేసేలా పర్యవేక్షించడం వీరి ప్రధాన బాధ్యతలు. సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాకుండా వ్యాపార అవసరాలపై కూడా అవగాహన కలిగి ఉండాలి.

### అనుభవజ్ఞులకు భారీ డిమాండ్

ఈ ఉద్యోగాలకు కంప్యూటర్ శాస్త్రం, యంత్ర అభ్యాసం లేదా సంబంధిత సాంకేతిక విభాగాల్లో విద్యార్హతలతో పాటు పలు సంవత్సరాల సాఫ్ట్‌వేర్ అనుభవం అవసరమవుతోంది. సాంకేతిక నైపుణ్యాలతో పాటు కస్టమర్లతో సమర్థంగా పనిచేసే సామర్థ్యం కూడా కీలకంగా మారింది. వ్యాపార సంస్థల్లో కృత్రిమ మేధస్సును సమర్థంగా ప్రవేశపెట్టగల నిపుణులకు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ నెలకొంది. సాంకేతిక రంగం భవిష్యత్తు పూర్తిగా కృత్రిమ మేధస్సు వైపు మళ్లుతున్న నేపథ్యంలో, ఈ తరహా నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులకు రాబోయే కాలంలో మరింత అధిక అవకాశాలు లభించే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.




# ఇథనాల్ కారుతో మారుతి కొత్త అడుగు




**న్యూఢిల్లీ, జూన్ 3 :** దేశీయ ఆటోమొబైల్ రంగంలో అతిపెద్ద సంస్థగా కొనసాగుతున్న మారుతి సుజుకి మరో కీలక ముందడుగు వేయబోతోంది. పర్యావరణహిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో సంస్థ తన తొలి పూర్తి ఇథనాల్ ఆధారిత కారును ఈ నెల 4న మార్కెట్లోకి తీసుకురానుంది. 'మారుతి సుజుకి ఈ–100' పేరుతో రానున్న ఈ వాహనం వంద శాతం ఇథనాల్ ఇంధనంతో నడిచే విధంగా రూపొందించబడినట్లు సమాచారం. మారుతి సుజుకికి అత్యంత ప్రజాదరణ తెచ్చిపెట్టిన వాగన్–ఆర్ మోడల్ ఆధారంగా ఈ కొత్త వాహనాన్ని అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న పెట్రోల్‌కు ప్రత్యామ్నాయంగా ఇథనాల్‌ను ఉపయోగించడం ద్వారా ఇంధన వ్యయాన్ని తగ్గించడమే కాకుండా వాతావరణ కాలుష్యాన్ని కూడా గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం దేశంలో విక్రయించే పెట్రోల్‌లో సుమారు 20 శాతం ఇథనాల్‌ను కలుపుతున్నారు. భవిష్యత్తులో ఈ శాతాన్ని మరింత పెంచి విదేశాల నుంచి చమురు దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలోనే వాహన తయారీ సంస్థలు కూడా ఇథనాల్ ఆధారిత వాహనాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. నాలుగు చక్రాల వాహనాలతో పాటు ద్విచక్ర వాహన రంగంలోనూ ఇథనాల్ సాంకేతికతకు ప్రాధాన్యం పెరుగుతోంది. దేశీయ ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ కూడా పూర్తి ఇథనాల్ ఇంధనంతో నడిచే కొత్త మోటార్‌సైకిల్‌ను మార్కెట్లోకి తీసుకురావడానికి సిద్ధమైంది. ఈ వాహనం ఆవిష్కరణ కూడా ఇదే సమయంలో జరగనుండటం విశేషం. దేశంలో హరిత ఇంధన వినియోగాన్ని పెంచడం, రైతులు పండించే చెరకు వంటి పంటలకు అదనపు డిమాండ్ కల్పించడం, చమురు దిగుమతుల ఖర్చును తగ్గించడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ విధానాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో మారుతి సుజుకి తీసుకొస్తున్న కొత్త వాహనం దేశ ఆటోమొబైల్ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇథనాల్ ఆధారిత వాహనాలు విస్తృతంగా అందుబాటులోకి వస్తే వినియోగదారులకు తక్కువ ఖర్చుతో ప్రయాణ సౌకర్యం లభించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా పెద్ద ఎత్తున మేలు జరిగే అవకాశం ఉందని రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# భారత్‌పై అదనపు సుంకాల ప్రతిపాదన



**న్యూఢిల్లీ, జూన్ 3 :** బలవంతపు శ్రమ లేదా వెట్టిచాకిరి ద్వారా తయారవుతున్న వస్తువుల దిగుమతులను అడ్డుకోవడంలో తగిన చర్యలు తీసుకోవడం లేదనే కారణంతో భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 60 దేశాలపై అదనపు దిగుమతి సుంకాలు విధించాలని అమెరికా వాణిజ్య ప్రతినిధుల కార్యాలయం అమెరికా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కొన్ని దేశాల్లో పెరుగుతున్న పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యం కూడా ప్రపంచ వాణిజ్య సమతుల్యతను దెబ్బతీస్తోందని అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా వాణిజ్య చట్టంలోని ప్రత్యేక నిబంధనల ప్రకారం ఈ ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. బలవంతపు శ్రమతో తయారయ్యే ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలోకి ప్రవేశించకుండా కట్టడి చేయడంలో పలు దేశాలు మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అమెరికా అభిప్రాయపడుతోంది. ఈ నేపథ్యంలోనే సంబంధిత దేశాలపై అదనపు సుంకాల విధింపు అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ స్పందించింది. అమెరికా వ్యక్తం చేసిన ఆందోళనలపై ఇరు దేశాల మధ్య ఇప్పటికే చర్చలు కొనసాగుతున్నాయని స్పష్టం చేసింది. వెట్టిచాకిరి నిర్మూలన విషయంలో భారత్ కట్టుబడి ఉందని, ఈ అంశంపై దేశంలో అమలవుతున్న చట్టాలు, చర్యల గురించి అమెరికా అధికారులకు వివరిస్తున్నట్లు తెలిపింది. భారత్, అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలనే లక్ష్యంతో సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని కేంద్రం పేర్కొంది. అదనపు సుంకాల అంశంపై ఏర్పడిన తాజా వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు దౌత్యపరమైన సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించింది. ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య చాలా కాలంగా చర్చల్లో ఉన్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి జరుగుతోందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే భారత్––అమెరికా వాణిజ్య సంబంధాలు మరింత విస్తరించే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య విధానాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో భారత్ తన ఎగుమతుల ప్రయోజనాలను కాపాడుకుంటూనే, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కార్మిక హక్కులు, ఉత్పత్తి విధానాల విషయంలో మరింత పారదర్శకతను పాటించేందుకు చర్యలు తీసుకుంటోందని కేంద్రం స్పష్టం చేసింది.

# పెట్రోల్ వినియోగం పెరుగుదల ఎల్‌పీజీ, ఎగుమతుల్లో తగ్గుదల

**న్యూఢిల్లీ, జూన్ 3 :** భారత ఇంధన మార్కెట్‌లో ఇటీవలి కాలంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పెట్రోలియం ప్రణాళిక మరియు విశ్లేషణ విభాగం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, దేశంలో డీజిల్‌తో పోలిస్తే పెట్రోల్ వినియోగం వేగంగా పెరుగుతోంది. 2026 మే నెల నాటికి పెట్రోల్ డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 2.8 శాతం పెరిగి 3,888 వేల మెట్రిక్ టన్నులకు చేరుకుంది. వ్యక్తిగత వాహనాల వినియోగం పెరగడం, ప్రజల ప్రయాణ విధానాల్లో వచ్చిన మార్పులు, ఆర్థిక కార్యకలాపాల విస్తరణ వంటి అంశాలు ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. డీజిల్ వినియోగంలో కూడా స్వల్ప వృద్ధి నమోదైనప్పటికీ, పెట్రోల్ డిమాండ్‌తో పోలిస్తే అది తక్కువగానే ఉంది. వ్యక్తిగత రవాణా సాధనాలపై ప్రజలు ఎక్కువగా ఆధారపడటం వల్ల పెట్రోల్ విక్రయాలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో కూడా ఈ ధోరణి కొనసాగుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

### ఎల్‌పీజీ వినియోగంలో భారీ తగ్గుదల

దేశంలో అత్యధికంగా తగ్గుదల నమోదైన ఇంధనంగా ఎల్‌పీజీ నిలిచింది. 2026 మే నెలలో ఎల్‌పీజీ వినియోగం 19.16 శాతం క్షీణించి 21.2 లక్షల టన్నులకు పడిపోయింది. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఇంధన దిగుమతుల్లో అంతరాయాలు ఏర్పడటం దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. సరఫరా సమస్యలను నియంత్రించేందుకు ప్రభుత్వం వాణిజ్య వినియోగదారులకు గ్యాస్ పంపిణీపై కొన్ని పరిమితులు విధించింది. అలాగే బుకింగ్ నిబంధనలను కఠినతరం చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరగడంతో సాధారణ వినియోగదారులు, వ్యాపార వర్గాలు ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మొగ్గు చూపుతున్నాయి. ఫలితంగా ఎల్‌పీజీ వినియోగం గణనీయంగా తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

### ఇంధన ఎగుమతుల్లో క్షీణత

భారతదేశం నుంచి జరుగుతున్న పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు కూడా క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో దేశ మొత్తం ఎగుమతుల్లో పెట్రోలియం ఉత్పత్తుల వాటా 8.8 శాతానికి పడిపోయింది. ఇది గత పదేళ్లలోనే అత్యల్ప స్థాయిగా నమోదైంది. ముఖ్యంగా డీజిల్, విమానయాన ఇంధన ఎగుమతులు వరుసగా తగ్గుతూ వస్తున్నాయి. గత మూడు సంవత్సరాలుగా డీజిల్ ఎగుమతులు క్షీణిస్తుండగా, విమానయాన ఇంధన ఎగుమతులు 20 శాతానికి పైగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ మందగించడం, సరఫరా వ్యవస్థలో ఏర్పడిన అస్థిరత ఈ పరిస్థితికి కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. దేశీయ వినియోగం పెరుగుతున్నప్పటికీ, విదేశీ మార్కెట్లలో డిమాండ్ బలహీనపడటం రిఫైనరీల ముందు కొత్త సవాళ్లను తీసుకొస్తోంది. భారత ఇంధన రంగ భవిష్యత్తు అంతర్జాతీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పనితీరు ప్రభావం.. విప్రో సీఈఓ జీతం తగ్గింపు



**బెంగళూరు, జూన్ 3 :** ప్రముఖ సమాచార సాంకేతిక సంస్థ విప్రో ప్రధాన కార్యనిర్వాహక అధికారి శ్రీనివాస్ పల్లియా 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.49.6 కోట్ల వేతన ప్యాకేజీ అందుకున్నారు. అయితే గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆయన వేతనం తగ్గినట్లు సంస్థ నివేదికలు వెల్లడించాయి. కంపెనీ నిర్దేశించుకున్న పనితీరు లక్ష్యాలను పూర్తిగా చేరుకోలేకపోవడంతో పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలలో కోత విధించబడింది. ప్రస్తుతం సమాచార సాంకేతిక రంగం ఎదుర్కొంటున్న మందగమనం, ఖర్చుల నియంత్రణ చర్యలు, అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు ఈ వేతన తగ్గింపుకు ప్రధాన కారణాలుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ విప్రోలో అత్యధిక వేతనం అందుకుంటున్న ఉన్నతాధికారిగా శ్రీనివాస్ పల్లియా కొనసాగుతున్నారు. పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలలో తగ్గింపు కారణంగా వార్షిక ఆదాయంలో గణనీయమైన మార్పు చోటుచేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా సమాచార సాంకేతిక రంగం ఒత్తిడిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో అనేక సంస్థలు ఖర్చులను నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నాయి. అదే విధంగా విప్రో కూడా వ్యయ నియంత్రణపై దృష్టి సారించింది. కంపెనీ ఆశించిన స్థాయిలో వృద్ధిని నమోదు చేయడంలో ఎదురైన సవాళ్లు సీఈఓ వేతనంపై ప్రభావం చూపినట్లు సంస్థ వర్గాలు తెలిపాయి. భవిష్యత్తులో వ్యాపార పరిస్థితులు మెరుగుపడితే ప్రోత్సాహకాల రూపంలో ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక విప్రో కార్యనిర్వాహక అధ్యక్షుడు రిషద్ ప్రేమ్‌జీ వేతనంతో పోలిస్తే శ్రీనివాస్ పల్లియా వేతనం దాదాపు ఏడు రెట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఒకే సంస్థలో అత్యున్నత స్థాయి నాయకుల మధ్య వేతనాల్లో ఇంత పెద్ద వ్యత్యాసం ఉండటం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం సంస్థ వ్యాపార విస్తరణ, ఆదాయ వృద్ధి, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీతత్వాన్ని పెంచేందుకు శ్రీనివాస్ పల్లియా నాయకత్వం కీలకంగా మారింది. రానున్న కాలంలో విప్రో పనితీరు ఎలా ఉండబోతోందనే అంశంపై పెట్టుబడిదారులు, మార్కెట్ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# గుడ్డ కాల్చి మీద వేస్తామంటే ఊరుకోం

## డీఎస్సీపై ఆధారాలు లేకుండా విమర్శలా

- చిత్తశుద్ధి.. ప్రజలకు జవాబుదారి ఈ ప్రభుత్వం
- ఏడాది తర్వాత ఇప్పుడు రాద్ధాంతం హాస్యాస్పదం
- స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్లు పబ్లిక్ డోమైన్‌లో ఉంది
- అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చు
- జగన్ తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత



**అమరావతి, జూన్ 3 :** డిఎస్సీ 2025ను ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిందని రాష్ట్ర హోం శాఖామంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఏపీ సచివాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రజలకు జవాబుదారిగా పని చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం కనీసం ఒక్క డిఎస్సీ ని కూడా నిర్వహించ లేకపోయిందని ఎన్నికలకు 60 రోజుల ముందు డిఎస్సీ నోటిఫికేషన్ కేవలం 6100 పోస్ట్ లతో వేశారని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు.కాని మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో మెగా డిఎస్సీ నిర్వహించారని తెలిపారు.8 సంవత్సరాల నిరీక్షణ అనంతరం కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సీని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తే ఇప్పుడు దాదాపు 8, 9 నెలల తరువాత రాద్ధాంతం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నో డిఎస్సీలు సమర్థవంతంగా నిర్వహించారని, ఆయా డిఎస్సీల ద్వారా ఇప్పటి వరకు దాదాపు 2 లక్షల మంది ఉపాధ్యాయులుగా సేవలు అందిస్తున్నారని మంత్రి అనిత గుర్తు చేశారు.వాస్తవంగా రాష్ట్రంలో సుమారు 3.11లక్షల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉంటే వారిలో 60 శాతం మంది ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే ఉద్యోగాలు సాధించారన్నది తేటతెల్లం అవుతుందని పేర్కొన్నారు. అంతెందుకు తాను సైతం 2001లో డిఎస్సీ ద్వారానే ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించానని 12 సంవత్సరాల సర్వీసు తర్వాత రాజీనామా చేసి రాజకీయాల్లోకి రావడం జరిగిందని తెలిపారు.అందుకనే నా అనుభవంతో చెబుతున్నాను డిఎస్సీ నోటిఫికేషన్, ఎంపిక ప్రక్రియ, పోస్టింగ్స్ ఎలా జరుగుతాయో నాకు తెలుసని స్పష్టం చేశారు.ఎక్కడా అవినీతికి తావు లేకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా డిఎస్సీ నిర్వహణ జరుగుతుందన్నారు.డిఎస్సీ 2025 నిర్వహణకు ప్రభుత్వం 240కి పైగా కోర్టు కేసులు దాటుకుని సుమారు 148 రోజుల్లోనే రికార్డు స్థాయిలో 16,347 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించిందని చెప్పారు.అంతేకాకుండా 15వేలకు పైగా టీచర్ పోస్ట్ లు అతి గౌరవంగా వారికి అందించడం జరిగిందన్నారు. ఒకసారి ఆలోచిస్తే డిఎస్సీ నోటిఫికేషన్ వచ్చిన నాటి నుండి అభ్యర్థులు తమ కుటుంబాలకు దూరంగా ఎక్కడో సుదూర ప్రాంతాల్లో కోచింగ్ తీసుకుని మరీ సిద్ధం అవుతారన్నది వాస్తవమని అన్నారు.నెలలు సంవత్సరాల తరబడి శిక్షణ పొంది పరీక్ష వ్రాసి ఎంపికై సగౌరవంగా ఉద్యోగంలో చేరతారన్నది నిజమని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి తన చేతుల మీదుగా డిఎస్సీ అభ్యర్థులకు అపాయింట్ మెంట్ ఆర్డర్ లు అందించి దిశానిర్ధేశం చేశారని గుర్తు చేశారు.ఒక ఎమోషనల్ బాండింగ్ ఉన్న డిఎస్సీ పై అవాకులు చవాకులు పేలడం దారుణమని అన్నారు. నిబంధనల మేరకు డిఎస్సీ నిర్వహించి మూడు స్థాయిల్లో గ్రీవెన్స్ నిర్వహించి, గ్రీవెన్స్ లో 34 వేలకు పైగా గ్రీవెన్స్ వస్తే వాటి అన్నింటిని పరిష్కరించి ఎక్కడా చిన్న పొరపాటు లేకుండా డిఎస్సీ నిర్వహించామన్నారు.అత్యంత పకడ్బందీగా టీసీఎస్ ద్వారా దాదాపు 43వేల ప్రశ్నలను సిద్ధం చేసి మరీ డిఎస్సి నిర్వహించామన్నారు. స్పోర్ట్స్ కోటా కింద 3 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందని మంత్రి అనిత తెలిపారు. 3 శాతం రిజర్వేషన్ అంటే 421 పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించారని అయితే కేవలం అర్హులు 382 మందిని మాత్రమే భర్తీ చేయడం జరిగిందన్నారు.ఎంపికైన వారి సర్టిఫికెట్లను పబ్లిక్ డోమైన్ లో కూడా పెట్టడం జరిగిందని అవసరమైన వారు వాటిని పరిశీలించుకోవచ్చని అన్నారు.స్పోర్ట్స్ కోటా అయినా విద్యార్హతలు మాత్రం తప్పని సరి అని అవి కూడా 15 మంది సభ్యుల బృందం పరిశీలించి మరీ ఎంపిక చేయడం జరిగిందన్నారు.స్పోర్ట్స్ కోటాకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల క్రీడా సర్టిఫికెట్లను ఫెడరేషన్ లు,అసోసియేషన్ లకు పంపించి వెరిఫై చేసి ఆ తర్వాత హరిజంటల్ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. బ్రిడ్జి స్పోర్ట్స్ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలకు లోబడే ఆథరైజ్డ్ గా తీసుకోవడం జరిగిందన్నారు.బ్రిడ్జి స్పోర్ట్స్ ను ఏషియన్ గేమ్స్ 2018, 2022లో కూడా నిర్వహించారన్నారు. ఇందులో ఇండియా కు కాంస్య పతకం సైతం వచ్చిందన్నారు.గత ప్రభుత్వం గ్రూప్-1 ను అనేక అవకతవకలతో నిర్వహించి అభాసుపాలయిందని అటువంటి సంఘటనలు చంద్రబాబు పాలనలో ఒక్క సంఘటనైనా చూపాలని మంత్రి అనిత డిమాండు చేశారు.



# రాజకీయాల్లో కులదూషణలు దారుణం

## అమరజీవి పొట్టి శ్రీరాములుకు కూడా తప్పని కులచట్రం

## ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన

**అమరావతి, జూన్ 3:** భాష ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయులను కూడా నేడు కుల చట్రాల్లో బంధించడానికి సగటు రాజకీయ ఆలోచనలు చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిలో అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశించిన కుల నిర్మూలన పక్కనబెడితే.. 1989 నుంచి రాజకీయాల్లో కుల దూషణలు విపరీతంగా పెరిగిపోయాయని మండిపడ్డారు. కొంతమంది స్వార్థపరులు ఈ కుల సంఘాలను అడ్డం పెట్టుకుని వ్యక్తిగతంగా బాగుపడుతున్నారనే అనుమానం ఉందన్నారు. ఏ కులం నాయకుడితో ఆ కులం వారినే తిట్టించే నీచ సంస్కృతి వల్ల యువత భావోద్వేగాలకు లోనవుతున్నారని ఆందోళన చెందారు. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మరీ దిగజారిందని, సమాజానికి అద్దం పట్టే జర్నలిస్టులను సైతం కులాల పేరుతో దూషించడం ప్రారంభించారని ధ్వజమెత్తారు. ఒక వ్యక్తి తప్పు చేస్తే, దానికి కులాలను ఆపాదిస్తూ సమాజంలో చిచ్చు పెడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ ఎమ్మెల్సీ దళిత యువకుడిని హత్య చేసి, శవాన్ని ప్యాక్ చేసి డోర్ డెలివరీ చేసినా ఆ పార్టీ వెనుకేసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా హింసించి చంపేసినా ఆయా కుల సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినా వైసీపీ తీరు మారలేదని, ఇలాంటి కుల రాజకీయాలకు చరమగీతం పాడాలని జనసేన గట్టిగా నిర్ణయించుకుందని స్పష్టం చేశారు. ఇటీవల కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో దీనిపై చర్చించామని.. ఎవరు ఎలా మాట్లాడినా తామంతా కలిసికట్టుగా స్పందిస్తామని పవన్ తెలిపారు. ఇకపై రాజకీయాల్లో జరిగే కుల దూషణలను, అరాచకాలను తిప్పికొట్టేందుకు జనసేన పక్షాన 'సేన గళం' పేరుతో ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు, ఇకపై ఎవరు దూషించినా 'సేన గళం' గట్టిగా స్పందిస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు

# హాస్టళ్లను, గురుకులాల భవనాలు సిద్ధం చేయండి

## బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశం



**అమరావతి, జూన్ 3:** వచ్చే నెల 12 నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో బీసీ హాస్టళ్లను, గురుకులాల భవనాలను సిద్ధం చేయాలని, విద్యార్థుల సంఖ్య పెంచేలా అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. బీసీ బిడ్డలెవరూ బడి బయట ఉండకూడదని స్పష్టంచేశారు. హాస్టళ్లు, తరగతి, విశ్రాంతి గదులను పరిశుభ్రం చేయాలని, పరిశుద్ధమైన నీరందించేలా చూడాలన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత బుధవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో అడ్మిషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్వో ప్లాంట్లు, కిటికీలు, ద్వారాలకు దోమ తెరల ఏర్పాటు గురించి ఆరా తీశారు. బీసీ బిడ్డలు విద్యకు దూరంగా కాకూడదన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో విద్యతో పాటు ఆరోగ్య, ఆహార భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. సన్నబియ్యంతో భోజనం, తల్లికి వందనం, విద్యా మిత్ర కిట్లు అందజేయడంతో పాటు సకాలంలో డైట్, కాస్మోటిక్ ఛార్జీల చెల్లింపు, పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీటి కల్పనకు ప్రాధాన్యమివ్వడం వల్ల గతంలో ఎన్నడూ లేనంతగా టెన్త్, ఇంటర్ లో బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే బోధనపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని దిశా నిర్దేశం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. బీసీ హాస్టళ్లలోనూ అడ్మిషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బీసీ బిడ్డలెవరూ బడి బయట ఉండకూడదన్నారు. ఈ నెల అయిదో తేదీన గురుకుల పాఠశాల ప్రిన్సిపాళ్లు, హాస్టళ్ల వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూవోలు, డీబీసీడబ్ల్యూవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఆ కాన్ఫరెన్స్ లో హాస్టళ్లు, గురుకులాల నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని మంత్రి సవిత సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఎంజేపీ గురుకులాల కార్యదర్శి మాధవీలత ఇతర అధికారులు పాల్గొన్నారు.

# టూరిజం హబ్‌గా పోలవరం

## స్పిల్‌వేకు దిగువన బ్రిడ్జి నిర్మాణానికి షెడ్యూల్

## ఏలూరు, కొవ్వూరు, రాజమండ్రిలకు కలుపుతూ హైవే కనెక్టివిటీ

## గోదావరి పుష్కరాల నాటికి పనులు పూర్తి చేయాలి

## అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, డిజైనర్స్‌తో మంత్రి నిమ్మల సమీక్ష



**అమరావతి, జూన్ 3:** గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు ను టూరిజం హబ్‌గా రూపొందించాలని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ఆదేశించారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. సీఎం ఆదేశాలకు తగ్గట్లే లేఅవుట్ ప్లాన్ డిజైన్ తయారు చేసేందుకు 9,900 ఎకరాల విస్తీర్ణంతో లైడార్ సర్వే కూడా పూర్తి చేశామని స్పష్టం చేశారు. బుధవారం అమరావతి సచివాలయంలో పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి నిమ్మల పోలవరం ప్రాజెక్టును ఏలూరు, కొవ్వూరు, రాజమండ్రిలకు జాతీయ రహదారులతో అనుసంధానించేలా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. స్పెల్ వేకి దిగువన బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబందించి డిజైన్స్ అనుమతులు, ఇతర పనుల కోసం షెడ్యూల్ ఇవ్వాలని, ఆ షెడ్యూల్ కు అనుగుణంగా కాలయాపన లేకుండా పనులు చేయాలని అధికారులను, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్ట్ లో కీలకమైన ఈసిఆర్ఎఫ్ డ్యాం పనులు గ్యాప్-1 లో 45 శాతం, గ్యాప్-2 లో 22 శాతం పూర్తయ్యాయి అని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు ఈ ఏడాది ఆగష్టు నాటికి పూర్తి చేసి, అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకెళ్తాం అని అన్నారు. ఇంక కుడి, ఎడమ ప్రధాన కాలువల టన్నెల్స్ కనెక్టివిటీల పనులు 90 శాతం పూర్తయ్యాయి తెలిపారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశి భూషణ్ కుమార్, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, పోలవరం ప్రాజెక్టు ఎస్ఈ రామచంద్ర రావు, మేఘా ఇంజనీరింగ్ సంస్థ జాయింట్ సివోవో అంగర సతీష్ బాబు, డిజిఎం మురళీ, మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయానికి గుర్తింపు

## ప్రతిష్ఠాత్మక 'ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026' పురస్కారం

**అమరావతి, జూన్ 3:** ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్ఠాత్మక 'ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026' పురస్కారం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం కు దక్కింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఇది రాష్ట్రానికి లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం విజయవంతంగా అమలవుతోందన్నారు. రైతులు, గ్రామీణ మహిళలు, వ్యవసాయ శాఖ అధికారులు, ఖా సంస్థ, శాస్త్రవేత్తల సమిష్టి కృషి ఫలితంగానే ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపారు. ప్రపంచ స్థాయిలో లభించిన ఈ పురస్కారాన్ని రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు అంకితం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతమైన ఈ నమూనాను దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. సుస్థిర వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు రైతాంగ అభివృద్ధికి కొత్త అవకాశాలు తీసుకురావడంతో పాటు ప్రకృతి వ్యవసాయానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అచ్చెన్నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

# గంగపాలెంలో పెద్దపులి సంచారం

## పలు పశువులపై దాడి చేసి చంపిన పులి

## ఆందోళనలో స్థానిక ప్రజలు



**ఏలూరు, జూన్ 3:** పోలవరం జిల్లా దేవీపట్నం మండలం గంగపాలెంలో పెద్దపులి సంచారం కలవరపెడుతోంది. మంగళవారం రాత్రి పశువులపై దాడి చేసిన పులి.. 16 దూడలు, ఒక గేదెను హతమార్చింది. దీంతో గ్రామస్థుల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో భారీగా పశువులు ఉండటంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు.. మైదాన ప్రాంతాల నుంచి గండి పోచమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులను పోతవరం వద్ద అటవీ శాఖ అధికారులు నిలిపేస్తున్నారు. మొత్తంగా గంగంపాలెం గ్రామం సమీప ప్రాంతాల్లో పెద్దపులి సంచారంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురువుతున్నారు. గత కొద్ది రోజులుగా అటవీ ప్రాంతాల నుంచి గ్రామాల వైపు వస్తున్న పెద్దపులి మూగజీవాలపై వరుసగా దాడులు చేస్తోంది. ఇప్పటివరకు 14 ఆవుదూడలు, 2 గేదెలను చంపింది. దీంతో రైతులు, పశుపోషకులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.గ్రామ శివార్లలో సంచరిస్తున్న పులి పశువుల మందలపై దాడి చేస్తోంది. ముఖ్యంగా గంగంపాలెం, దండంగి, పోశమ్మగండి గ్రామాల పరిసర ప్రాంతాల్లో ప్రజలు బయటకు రావడానికి కూడా భయపడుతున్నారు. పిల్లలను ఒంటరిగా బయటకు పంపకూడదని గ్రామ పెద్దలు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం పెద్దపులి దండంగి గ్రామం, పోశమ్మగండి గ్రామాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. పులి కదలికలను పర్యవేక్షించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాటు చేశారు. అదేవిధంగా అటవీశాఖ ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి పులిని సురక్షితంగా పట్టుకునేందుకు చర్యలు చేపట్టాయి. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని సూచిస్తున్నారు. పులి కనిపించిన వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. ఈ ఘటనతో దేవీపట్నం మండలం పరిసర ప్రాంతాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. ఒకవైపు పశువుల నష్టం రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తుండగా, మరోవైపు ప్రజల భద్రతపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పులిని త్వరగా పట్టుకుని తిరిగి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# సీఐ చినమల్లయ్య సస్పెండ్



**పల్నాడు, జూన్ 3:** అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న సీఐ చిన్న మల్లయ్యను ఉద్యోగం నుంచి పోలీసుశాఖ డిస్మిస్ చేసింది. శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. తనపై అత్యాచారం చేశాడని సీఐ చిన్న మల్లయ్యపై ఓ మహిళ ఏప్రిల్ 29న వినుకొండలో ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై అత్యాచారం కేసు నమోదైంది. అప్పటి నుంచి సీఐ చిన్నమల్లయ్య అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయగా.. హైకోర్టు దానిని కొట్టివేసింది. దీంతో సుప్రీంకోర్టును ఆశ్రయించిన సీఐకి.. అక్కడ కూడా చుక్కెదురైంది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.